ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం, ఏప్రిల్ 22, 2026 | సంపుటి - 22 | సంచిక 204 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం

### నార్వే బృందంతో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,ఏప్రిల్ 21(నినాదం):**

తెలంగాణలో పెట్టుబడుల కోసం నార్వే కంపెనీలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు. లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించారు. మంత్రి శ్రీధర్ బాబుతో నార్వే ప్రతినిధులు ఈరోజు మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యారు. మే ఎలిన్ స్టెనర్ నేతృత్వంలో హై లెవల్ డెలిగేషన్ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రితో వారు చర్చించారు. 'తెలంగాణ`నార్వే' ద్వైపాక్షిక సహకారంపై కీలక చర్చలు జరిగాయి. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల విధానాలు ఉన్నాయని తెలిపారు. క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఏఐ, క్లైమేట్ టెక్, హెల్త్ టెక్ రంగాల్లో కలసి పని చేసేందుకు రోడ్ మ్యాప్ సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. 'తెలంగాణ`నార్వే వర్కింగ్ గ్రూప' ఏర్పాటు ప్రతిపాదనపై కూడా చర్చించారు. పెట్టుబడులకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి నార్వే సిద్ధమని రాయబారి వెల్లడించారు.

## రీల్స్ మోజులో

### బిల్డింగ్‌పై నుంచి పడ్డ బాలుడు చికిత్స పొందుతూ మృతి

గంటలు తరబడి రీల్స్ స్క్రోల్ చేస్తూ టైం వేస్ట్ చేసేవారు కొందరైతే... రీల్స్ కోసం రిస్క్ చేసి ప్రాణాల మీదకు తెచుకునేవారు మరికొందరు. రీల్స్ కోసం రిస్క్ చేసి మరో బాలుడు ప్రాణాలు వదిలాడు.హైదరాబాద్ లో దారుణం జరిగింది. సోషల్ మీడియాలో రీల్స్ చేస్తూ బిల్డింగ్ పై నుంచి జారిపడి బాలుడు మృతి చెందాడు. ఏప్రిల్ 5న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 2

## ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్



తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 38ను విడుదల చేసింది. 2

## తెలంగాణకు పదేళ్లలో కేంద్రం రూ.12 లక్షల కోట్లు

### రాష్ట్ర బీజేపీ చీఫ్ రాంచందర్ రావు వెల్లడి



## భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్తదిశ



- కూసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

భూభారతి పోర్టల్‌తో భూమి హక్కులకు శాశ్వత భరోసా 2

*భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్త దిశ సాకారమైందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్ జరిగిందని పేర్కొన్నారు. భూభారతి పోర్టల్‌తో భూమి హక్కులకు శాశ్వత భరోసా కల్పించామని చెప్పుకొచ్చారు. ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయించామని వెల్లడించారు.*

**ఖమ్మం,ఏప్రిల్ 21(నినాదం):** రిజిస్ట్రేషన్ కు సర్వే మ్యాప్ తప్పనిసరి చేస్తూ కొత్త నిబంధన ఉంటుందని స్పష్టం చేశారు. ఈరోజు (మంగళవారం) ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వి డియాతో మాట్లాడారు. భూభారతి పోర్టల్ రైతులకు భద్రత, కుటుంబాలకు నమ్మకమని తెలిపారు.

## ఇథనాల్ వాడకంపై దృష్టి సారించాలి

- ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాలి
- కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ

*భవిష్యత్‌లో 100 శాతం ఇథనాల్ బ్లెండింగ్ సాధించాలని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు. పశ్చిమాసియా సంక్షోభంతో ఇంధన సరఫరాలో ఆటంకాలు ఎదుర్కొంటున్నామని గుర్తుచేశారు.* 2



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 21(నినాదం):** ఇలాంటి సమస్యలను అధిగమించేందుకు ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరముందని మంత్రి అన్నారు. దిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ ఇంధన రంగం 87 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఇందుకోసం ఏకంగా



## కేరళలో ఘోరం

- త్రిస్సూర్‌లో బాణసంచా పరిశ్రమలో భారీ పేలుడు
- 13కు పైగా చేరిన మరణాలు • 30 మందికి గాయాలు 2

**తిరువనంతపురం, నినాదం:** కేరళ త్రిస్సూర్‌లోని ఓ బాణసంచా పరిశ్రమలో భారీ పేలుడు సంభవించిన ఘటనలో మృతుల సంఖ్య 13 కు చేరింది. 30 మంది గాయపడ్డారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. పూరం వేడుక కోసం ముండతికోడ్‌లో నిల్వ ఉంచిన బాణసంచా కేంద్రాల్లో ఈ ప్రమాదం జరిగింది.



## మరో సకలజనుల సమ్మెలా ఆర్టీసీ సమ్మె

- నోటీసు ఇచ్చి 41 రోజులవుతున్నా స్పందన లేదు
- నష్టాల్లోని మెట్రోను ప్రభుత్వపరం చేయాలని చూస్తున్నరు
- ఆర్టీసీని మాత్రం ప్రభుత్వం పట్టించుకుంటలేరు
- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియ ఏదీ
- కాలయాపన కోసమే కమిటీ • ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న 2

***తాము తలపెట్టిన సమ్మెకు అన్ని ఆర్టీసీ సంఘాలు, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న తెలిపారు. సమ్మె నోటీసు ఇచ్చి 41 రోజులవు తున్నా.. ఇప్పటికీ ప్రభుత్వం, యాజమాన్యం చర్చలు జరపకపోవడం విచారకరమన్నారు. ఈ నెల 22 నుంచి తలపెట్టిన సమ్మెపై ఆర్టీసీ జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడారు. నష్టాల్లో ఉన్న మెట్రోను ప్రభుత్వపరం చేయాలని చూస్తున్నారు. ఆర్టీసీని మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు.***

**హైదరాబాద్,ఏప్రిల్21(నినాదం):** సమ్మె కొనసాగుతుందని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సమ్మెపై జో క్యం చేసుకోవాలి. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన పక్రియ ఇప్పటికీ మొదలుపెట్టలేదు. కాలయాపన కోసమే విలీన కమిటీ వేశారు.ఆర్థిక పరిస్థితి బాగా లేకపోతే.. మూసీ అభివృద్ధి ఎలా చేస్తున్నారు.. ఎలక్ట్రిక్రల్ బస్సు లతో ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ పరం చేయాలనే ఆలోచన చేస్తున్నారు. ఆర్టీసీని హైదరాబాద్‌లో లేకుండా చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఆర్టీసీ భూములను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయాలని చూస్తున్నారు. ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ సిబ్బంది కూడా సమ్మెలో పాల్గొనాలి. ఆర్టీసీ సమ్మె.. మరో సకల జనుల సమ్మెగా మారబోతోందని జేఏసీ ఛైర్మన్ వెంకన్న హెచ్చరించారు. సమ్మె ప్రారంభం అవుతున్నా.. ఇప్పటి వరకు ఆర్టీసీ అధికారులు, ప్రభు త్వం మమ్మల్ని చర్చలకు పిలవలేదని.. సమ్మె నివారణ కోసం కనీస చర్యలు తీసుకోవటం లేదన్నారు.




## సమ్మె ఆలోచన విరమించండి



2 వివరాలు

- చర్చలకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధమే
- ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం వినతి

## ఏటిఎంలా కాళేశ్వరం ప్రాజెక్టు

- అప్పుడు కెసిఆర్‌కు.. ఇప్పుడు రేవంత్‌కు
- రేవంత్ రాహువు, కేసీఆర్ కేతువు అంటూ బండి విమర్శలు 2

**హైదరాబాద్, నినాదం:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మాట మార్చారని కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన స్కామ్ రూ.లక్ష కోట్లా? రూ.9వేల కోట్లా? అని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబంలో ఒక్కరిపై అయినా ప్రభుత్వం చర్యలు తీసుకుందా అని నిలదీశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌పై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్ రాహు వు, కేసీఆర్ కేతువు అంటూ వ్యాఖ్యానించారు. కేసీఆ ర్, రేవంత్ భాషను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు.



## 3 నెలల్లోగా తేల్చాలి..

- ఐఏఎస్ రజత్ అవినీతిపై విచారించాలి
- కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు 2



**న్యూఢిల్లీ, నినాదం:** తెలంగాణ ఐఏఎస్ అధికారి రజత్ కుమార్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి ఢిల్లీ హైకోర్టులో కీలక విచారణ జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## ఔను.. లాయర్లతో మాట్లాడడానికే ఢిల్లీ వెళ్లా

- కెసిఆర్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసు
- హుందాగా మాట్లాడడం నేర్చుకుంటే మంచిది
- కావాలనే కెసిఆర్ సభరోజు సభ పెట్టారు
- కురచ బుద్ధి చాటుకున్న రేవంత్ రెడ్డి
- మాజీ మంత్రి హరీశ్‌రావు



*బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ సూచన మేరకే ఢిల్లీ వెళ్లి లాయర్లను కలిసినట్లు మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. సీఎం పెట్టే అక్రమ కేసులను ఎదుర్కొనేందుకే అక్కడి లాయర్లతో మాట్లాడినట్లు చెప్పారు.*

**హైదరాబాద్, నినాదం:** హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన వి డియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. కాళేశ్వరం కేసులపై సీనియర్ లాయర్లతో చర్చించేందుకు వెళ్లినట్లు చెప్పారు. ఓటుకు నోటు కేసు కూడా రేపు సుప్రీంకోర్టులో విచారణకు రానుంది.

## అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్ మించినోళ్లు లేరు

- పదేళ్లలో అబద్దాలతోనే పాలన
- బిఆర్ఎస్‌లో ఇప్పుడు పంపకాల పంచాయితీ
- రబీ ధాన్యంసేకరణపై అధికారులతో కోమటిరెడ్డి సమీక్ష

2

**నల్గొండ, నినాదం:** అబద్దాలు చెప్పడంలో కేసీఆర్‌ను మించినోళ్లు లేరని, బీఆరఎస్ అధినేత కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శలు చేశారు. కేసీఆర్ గతంలో దళితుడిని సీఎం చేస్తాం.. ఇంటికో ఉద్యోగం ఇస్తాం.. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ బీఆరఎస్ అధికారంలోకి ఉన్న పదేండ్లలో హామీలు అమలు చేయలేదని విమర్శించారు.



## తమిళనాట ముగిసిన ఎన్నికల ప్రచారం

### బెంగాల్లో తొలిదశ ప్రచారానికి తెర

### 23న పోలింగ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు

**హైదరాబాద్, నినాదం:** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ప్రచార గడువు ముగిసింది. పశ్చిమ బెంగాల్‌లోనూ మొదటి విడత ఎన్నికల ప్రచారానికి తెరపడింది. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు, బెంగాల్‌లో తొలి విడతలో 152 సీట్లకు ఈ నెల 23న పోలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది.



# రీల్స్ మోజులో
## బిల్డింగ్‌పై నుంచి పడ్డ బాలుడు

**హైదరాబాద్, నినాదం:** ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి... హైదరాబాద్‌లోని నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లాపూర్ గాంధీ బొమ్మ బస్తీకి చెందిన 14 ఏళ్ళ బాలుడు మితున్ రీల్స్ చేస్తూ బిల్డింగ్ పైనుంచి పడి మృతి చెందాడు. ఏప్రిల్ 5న జరిగిన ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ మిథున్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం మృతి చెందాడు. మితున్ బిల్డింగ్ మీద నుంచి కిందపడుతున్న ద శ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. బాలుడి మృతితదేహాన్ని బీహార్ కు తరలిస్తున్నారు బంధువులు. మితున్ మృతితితో అతని కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, నినాదం:**

ఈ బదిలీల ప్రక్రియ మే 1 నుంచి మే 31 వరకు జరగనుంది. ఒకేచోట మూడేళ్లు పనిచేసిన ఉద్యోగుల బదిలీలకు సర్కార్ అనుమతి ఇచ్చింది. నాలుగేళ్లకు మించి ఒకేచోట పోస్టింగ్‌లో ఉండరాదని స్పష్టం చేసింది. భార్యాభర్తలు, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులకు ముందుగా ప్రాధాన్యం ఉండనుంది. మొత్తం ఉద్యోగులలో 40 శాతానికి మించకుండా మాత్రమే బదిలీలు చేపట్టాలని సర్కార్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జూన్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ బదిలీలపై నిషేధం అమల్లోకి రానుంది. బదిలీలను కౌన్సెలింగ్ ద్వారా అత్యంత పారదర్శకంగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

## తెలంగాణకు పదేళ్లలో కేంద్రం రూ.12 లక్షల కోట్లు

**హైదరాబాద్, నినాదం:**

తెలంగాణకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం భారీగా నిధులు ఇచ్చిందని రాష్ట్ర బీజేపీ చీఫ్ ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన మేరకు చేయూతను ఇస్తోందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లలో తెలంగాణకు కేంద్రం రూ.12 లక్షల కోట్లు ఇచ్చిందన్నారు. అలాగే గత రెండేళ్లలో రూ. లక్ష యాభై వేల కోట్లు రాష్ట్రానికి ఇచ్చిందని ఆయన వివరించారు. దీనిపై తాను చర్చకు సిద్ధమని ప్రకటించారు. అందుకు మీరు సిద్ధమా అంటూ.. బీఆరఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సవాల్ విసిరారు. ఈ అంశంపై మీరు ఇద్దరు ఎక్కడికి వచ్చినా తాను చర్చకు సిద్ధమన్నారు. ఈ సవాల్‌ను స్వీకరించి చెబితే తాను సైతం చర్చకు సిద్ధమని కుండబద్దలు కొడతానన్నారు. దేశ రాజధాని ఢిల్లీకి వచ్చి బీఆరఎస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తమ వద్ద రాయబారాలు నడపడం లేదని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి.. ఆ పార్టీ నేతల వద్ద మోకరిల్లుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మొత్తం సీబీఐకి ఇవ్వమంటే.. నాణ్యత లేని బ్యారేజీలను మాత్రమే సీబీఐకి అప్పగించారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వ వైఖరిని ఈ సందర్భంగా ఎండగట్టారు. దీనిని కాళేశ్వరం మొత్తం మీద సీబీఐ విచారణ అంటే ఎలా? అంటూ ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మోటార్లకు మీటర్లు కాదు.. గత పదేళ్లలో టీఆరఎస్, రెండేళ్లలో కాంగ్రెస్ అక్రమ మీటర్లు వేసి రూ. లక్షల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎదుగుదలను అడ్డుకునేందుకే సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్‌లు సమావేశాలు పెట్టినట్లుగా ఉందని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు పేర్కొన్నారు.

## భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్త దిశ

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెవెన్యూ సంస్కరణలు చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. ఐదు మండలాల్లో పైలట్‌గా భూభారతి అమలవుతోందని చెప్పుకొచ్చారు. ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలు ఒకే ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకొచ్చామని తెలిపారు. దేశానికి ఆదర్శంగా భూభారతి పోర్టల్ ఉంటుందని వ్యాఖ్యానించారు. కూసుమంచిలో చారిత్రాత్మకంగా తొలి నమోదు చేశామని వివరించారు. రైతు భూమి హక్కులకు ఓ స్పష్టత ఇచ్చామని.. సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పుకొచ్చారు. సర్వే మ్యాప్‌తో యాజమాన్యంపై ఎలాంటి సందేహం లేకుండా చర్యలు చేపట్టామని అన్నారు. ఆధునాతన టెక్నాలజీతో ఖచ్చితమైన భూసర్వేలు చేపడతామని.. దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## ఇథనాల్ వాడకంపై దృష్టి సారించాలి

ఏటా రూ.22 లక్షల కోట్లను ఖర్చుచేస్తోంది. కాలుష్యాన్ని తగ్గించేందుకు ఇంధన ప్రత్యామ్నాయ ఉత్పత్తులపై దృష్టి సారించాలి. కేవలం ఇథనాల్‌తోనే కాకుండా చెత్త నుంచి హైడ్రోజన్ తయారీ వంటి వినూత్న పద్ధతులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాల వినియోగం తగ్గించాలని గడ్కరీ అన్నారు. పెట్రోల్ ఉత్పత్తుల్లో 20 శాతం ఇథనాల్ వాడకంపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను తోసిపుచ్చారు. అంతేకాకుండా ఆటోమొబైల్ కంపెనీలు వాహనాల ధరల మీదనే కాకుండా ఇథనాల్ వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలకు అనుకూలంగా ఉండేలా నాణ్యమైన ఇంజన్ల తయారీపై దృష్టి సారించాలన్నారు.

## ఏటిఎంలా మారిన కాళేశ్వరం

గతంలో బీఆరఎస్‌కు.. ఇప్పుడు కాంగ్రెస్‌కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని కేంద్ర మంత్రి ఆరోపించారు. కేంద్రానికి రేవంత్‌రెడ్డి రాసిన లేఖలో ఏముందని అడిగారు. రూ.9వేల కోట్ల అవినీతిపై దర్యాప్తు జరపాలని సీఎం రేవంత్ అంటున్నారని.. మరి లక్ష కోట్ల స్కామ్ గురించి ఎందుకు లేఖ రాయలేదని ప్రశ్నించారు. రేవంత్ రాసిన లేఖలను కరపత్రాల రూపంలో ఇంటింటికీ పంచుతామన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ టూర్‌పై ఒక్కొక్కరూ ఒక్కోలా మాట్లాడుతున్నారని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళలు ఉన్నతస్థాయికి వెళ్లాలన్నదే ప్రధాని మోదీ లక్ష్యమని కేంద్ర మంత్రి తెలిపారు. మహిళా బిల్లును కాంగ్రెస్ అడ్డుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు. ఇందిరా, సోనియా, ప్రియాంక గాంధీకి పదవులు ఇస్తే మొత్తం మహిళలకు పదవులు వచ్చినట్టు భావిస్తున్నారన్నారు. విపక్షాల కుటుంబాల్లోని మహిళలకు పదవులు వస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగితే.. సీఎం రేవంత్ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్లేస్‌లో కూర్చోవాలని రేవంత్ రెడ్డి ఆలోచిస్తున్నారంటూ కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. మహిళా బిల్లు వీగిపోవడానికి స్టాలిన్, రేవంత్ రెడ్డినే కారణమని ఆరోపించారు. బీజేపీ, బీఆరఎస్ ఎప్పటికీ కలవవని.. కలిసి పోటీ చేయమని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు.

## కేరళలో ఘోరం

స్థానికంగా పంటపొలాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షెడ్‌లలో బాణసంచా తయారు చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే, ఘటన సమయంలో మొత్తం అక్కడ ఎంతమంది కార్మికులు ఉన్నారనే విషయంపై స్పష్టత లేనప్పటికీ.. వారి కోసం తెప్పించిన ఆహార ప్యాకెట్ల ఆధారంగా దాదాపు 40 మంది ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. సవి ప ప్రాంతాల్లోనూ బాణసంచా నిల్వ కేంద్రాలు ఉండటం, వరుసగా పేలుడు జరగడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడిందని రెస్క్యూ బృందాలు వెల్లడించాయి. అయితే, అధిక ఉష్ణోగ్రతలు ప్రమాదానికి ఓ కారణం కావచ్చని అనుమానిస్తున్నారు. బాణసంచా పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు స్థానిక మెడికల్ కాలేజీలో ఏర్పాట్లు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ అధికారులకు సూచించారు. తీవ్రంగా గాయాలైన బాధితులకు మెరుగైన చికిత్స అందించేందుకు ఇతర రాష్ట్రాల వైద్య నిపుణుల సాయం తీసుకోవాలని సూచించారు.

## కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు

ఐఏఎస్ అధికారిపై వచ్చిన ఫిర్యాదును మూడు నెలల్లోగా తేల్చాలని కేంద్రాన్ని ఆదేశించింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ల నిధులతో ఐఏఎస్ అధికారి తన కుమార్తె వివాహం నిర్వహించారని, అది నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఫై వ్ స్టార్ హోటల్‌లో జరిగిన ఈ వివాహ వేడుకలకు సంబంధించిన ఖర్చులను కాంట్రాక్టర్లే భరించారని పిటిషనర్ ఆరోపించారు. నాలుగేళ్లుగా కేసు విచారణలో ఎలాంటి పురోగతి లేకపోవడంపై ఢిల్లీ హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ఈ ఫిర్యాదుపై తార్కిక ముగింపు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అధికారం కేంద్ర ప్రభుత్వం చేతుల్లోనే ఉందన్న ఢిల్లీ హైకోర్టు.. ఈ ఫిర్యాదుపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది.

# మరో సకలజనుల సమ్మెలా ఆర్టీసీ సమ్మె

ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేయాలని అడుగుతున్న పట్టించుకోలేదని.. అధికారంలోని కాంగ్రెస్ పార్టీ.. తన మేనిఫెస్టో లో ఈ అంశాన్ని పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. తప్పని పరిస్థితుల్లోనే సమ్మె చేస్తున్నామన్నారు. ఇవి బస్సులు తీసుకొస్తున్న ప్రభుత్వం.. హైదరాబాద్ డిపోల్లో ఉన్న ఉద్యోగులను జిల్లాలకు పంపే ప్రయత్నం చేస్తుందని.. ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందన్నారు. ఆర్టీసీని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే కుట్రలో భాగంగానే ఇస్తున్నారని విమర్శించారు జేఏసీ చైర్మన్ వెంకన్న. సమ్మె చేయకుండా కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని.. ఎవరు భయపడొద్దని.. కార్మికులు అందరూ సమ్మె చేయడానికీ సిద్ధంగా ఉన్నారంటూ స్పష్టం చేశారాయన. కాలయాపన కోసమే కమిటీ అంటున్నారని.. మెట్రో రైల్ వ్యవస్థను వెంటనే విలీనం చేసిన ప్రభుత్వం.. ఆర్టీసీ విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రశ్నించారు.. ప్రభుత్వం పిలిస్తే చర్చలకు వెళ్లటానికి జేఏసీ సిద్ధంగా ఉందని వెల్లడించారు.




### సమ్మె ఆలోచన విరమించండి

టీజీఎసఆర్టీసీ కార్మికులు తలపెట్టిన సమ్మెను వెంటనే విరమించాలని వారికి తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కార్మికులకు ఆయన స్పష్టం చేశారు. ఆర్టీసి బలోపేతానికి తాము క్రుషి చేస్తున్నామని అన్నారు. కార్మికులు ప్రయాణికుల ద్రుష్టిలో ఆలోచించాలన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రతి విషయంలోనూ సానుకూలంగా ఉన్నారని అన్నారు. ఇప్పటికిప్పుడు చర్చకు తాము సిద్ధమని ఆయన పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణకు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఫ్రీ బస్సు వద్దంటూ బీఆరఎస్ అధినేత కేసీఆర్ పేర్కొనడం బాధాకరమన్నారు. హైడ్రాను రద్దు చేస్తామంటే కబ్జాదారులకు మద్దతు ఇవ్వడమేనని మంత్రి పొన్నం అభిప్రాయపడ్డారు. జగిత్యాలలో సోమవారం బీఆరఎస్ పార్టీ భారీ సభను నిర్వహించింది. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణలో రానున్నది తమ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే హైడ్రాను రద్దు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకం మహాలక్ష్మి వద్దని మాజీ సీఎం కేసీఆర్ పేర్కొనడం పట్ల పొన్నం తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

### ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**కవిత వెల్లడి**

ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికులంటే లెక్కలేనితనంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని కవిత మండిపడ్డారు. ఆర్‌టిసిలో కార్మికులు లేకుండా చేసి సంస్థను ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమ్మెకు దిగిన ఆర్టిజన్లను బెదిరించి విధుల్లో చేరేలా ఒత్తిడి చేశారని అన్నారు. ప్రజలందరూ సమస్యల్లో ఉంటే అధికార, ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నాయని మండిపడ్డారు. కార్మికులంటే ఈ ప్రభుత్వానికి లెక్కలేదని అన్నారు. ఆర్‌టిసిని ప్రైవేటుపరం చేసే కుట్రలను అడ్డుకుంటామని హెచ్చరించారు. వెంటనే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని కవిత డిమాండ్ చేశారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం, ప్రతిపక్షం సభలు పెట్టాయంటూ మండిపడ్డారు. ప్రతిపక్షం ఉట్టికథలు చెబితే.. ప్రభుత్వం పిట్టకథలు చెప్పిందంటూ వ్యాఖ్యానించారు. బీఆరఎస్ సభలో బీజేపీపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల గురించి ఎందుకు మాట్లాడలేదని జాగృతి అధ్యక్షురాలు నిలదీశారు. వెయ్యి ఏళ్లైనా బీఆరఎస్ మారదని కవిత వ్యాఖ్యానించారు. గుంటనక్క నిన్న ఢిల్లీ వెళ్లి ఆరఎసఎస్ పెద్దలను కలిసిందన్నారు. ప్రాజెక్ట్‌లో అవినీతి నుంచి బయటపడేందుకు ఆరఎసఎస్‌తో చర్చలు జరిపారంటూ కవిత ఆరోపించారు. ఈనెల 25న తెలంగాణ రాజకీయాల్లోకి నూతన రాజకీయ శక్తిగా వస్తున్నామని, ప్రజలందరికీ ఈ వేదిక నుంచి ఆహ్వానం పలుకుతు న్నామని చెప్పారు. పార్టీ ఆవిర్భావ సభకు సిరిసిల్ల నుంచి పార్టీ కార్యకర్తలు మంగళవారం పాదయాత్రగా బయలుదేరారని తెలిపారు. ఆవిర్భావ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే క్యాడర్ వాహనాలకు ఎలాంటి ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దని పోలీసులు, అధికార యంత్రాంగాన్ని కోరారు.

# అబద్ధాలు చెప్పడంలో కేసీఆర్ మించినోళ్లు లేరు

అబద్ధాలు చెప్పి మోసం చేయడం కెసిఆర్ నైజం అని మంత్రి ఎద్దేవా చేశారు. బీఆరఎస్ పార్టీ ఎప్పుడో విచ్ఛిన్నమైందని.. ఆ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం కల్ల అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీలో పంపకాల కోసం అధిపత్య పోరు జరుగుతుందన్నారు. ఫ్యామిలీ టెన్షన్స్‌తో కేసీఆర్ ఫ్రస్టేషన్లో ఉన్నారని.. అందుకే జగిత్యాల సభలో నోటికి వచ్చినట్లు మాట్లాడారని అన్నారు. కేసీఆర్ ఫస్ట్ ఆయన ఇల్లు చక్కదిద్దుకోవాలని ఆ తర్వాత పార్టీ పునర్నిర్మాణం గురించి ఆలోచించాలని సూచించారు. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ లీడర్ బీఆరఎస్ పార్టీలో చేరడం సరైన నిర్ణయం కాదని అభిప్రాయపడ్డారు. 2039 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. జగిత్యాలలో బీఆరఎస్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పారబట్టారు. ఈ క్రమంలో కెసిఆర్ ప్రసంగంపై మంత్రి దుయ్యబట్టారు. తెల్లారితే కొందరు నా చావు కోరుకుంటున్నారంటూ బీఆరఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి స్పందించారు. నా చావు కోరుకుంటున్నారని కేసీఆర్ అనడం సరికాదని.. మేమేప్పుడు ఆయన చావుని కోరుకోలేదన్నారు. బీఆరఎస్ నాయకులే సీఎం రేవంత్ రెడ్డిని ఇష్టానురంగా ఏకవచనంతో మాట్లాడుతున్నారని.. జనం మార్పు కోరుకుని ప్రజా ప్రభుత్వాన్ని గెలిపిస్తే ఉక్రోషంతో ఊగిపోతున్నారని విమర్శించారు. పదేండ్లలో కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని.. చివరకు ఔటర్ రింగ్ రోడ్డుని కూడా అమ్మేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటి దీన స్థితిలోకి రాష్ట్రాన్ని నెట్టేసి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవాలని జీవన్ రెడ్డి ఎందుకు నినాదాలు చేశారు..? పేదలకు రేషన్ కార్డులు ఇచ్చినందుకా.. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నందుకా.. ఎందుకు రేవంత్ ప్రభుత్వం పోవాలని ప్రశ్నించారు. ఇకపోతే రబీ ధాన్యం సేకరణపై అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్ష నిర్వహించారు. యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లు పెంచాలని ఆదేశించారు. అన్ని కేంద్రాలకు అవసరమైన లారీలు ఇవ్వాలని.. రాత్రి, పగలు ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు పంపాలని పేర్కొన్నారు. ధాన్యం ఎక్కువ వచ్చే గ్రామాలకు ఎక్కువ లారీలు పంపాలి. రోడ్లపై ధాన్యం పోయకుండా స్కూళ్లు, ఫంక్షన్ హాళ్ల వద్ద కేంద్రం పెట్టాలి. గత ప్రభుత్వ హయాంలో పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చి 3.78 కోట్ల మందికి సన్న బియ్యం ఇస్తున్నాం. కేసీఆర్, రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డితినే బియ్యమే పేదలకు పంపిణీ చేస్తున్నాం. పదేళ్లలో అప్పులు చేసి వెళ్లి.. ఒకేసారి బంగారు తెలంగాణ చేయాలంటే సాధ్యమేనా.. అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం నిల్వల విషయంలో రూ.11 వేల కోట్ల కుంభకోణం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొంత మేర ధాన్యం రికవరీ చేయించాం

## తమిళనాట ముగిసిన ఎన్నికల ప్రచారం

తమిళనాడులో తుదిరోజు అన్ని పార్టీల అగ్రనేతలు ముమ్మర ప్రచారం నిర్వహించారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్.. తన నియోజకవర్గం కొళత్తూరులో చివరి రోజు ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే వారికి తానో ప్రమాదకారిని అని హెచ్చరించారు. అన్ని రంగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచే తమిళనాడు వంటి రాష్ట్రాలను శిక్షించేందుకు డీలిమిటేషన్‌పై కేంద్రం తీవ్రంగా ఒత్తిడి తెచ్చిందని ఆరోపించారు. అన్నాడీఎంకే జనరల్ సెక్రటరీ పళనిసామి పశ్చిమ తమిళనాడులో ముమ్మరంగా ప్రచారం చేశారు. అవినీతి డీఎంకే ప్రభుత్వ పాలనకు ముగింపు పలకాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. ప్రధాని మోదీ, అమిత్ షా, విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మహారాష్ట్ర సీఎం ఫడణవీస్, రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్‌లు ఆయా కూటముల తరపున రాష్ట్రంలో ముమ్మర ప్రచారం నిర్వహించారు.

# వైసిపి రాజకీయ పార్టీ కానేకాదు

**రాజకీయ హత్యలకు డెన్‌గా మారింది**

**పార్టీ అనుమతులపై ఇసి ఆలోచన చేయాలి**

**దస్తగిరి హత్యతో వైసిపి నైజం మరింత బయటపడింది**

**మంత్రి కొలుసు పార్థసారధి సంచలన వ్యాఖ్యలు**

అమరావతి :
వైసీపీ రాజకీయ పార్టీ కాదని.. హత్య రాజకీయాలకు డెన్‌గా తయారైందని ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయ పార్టీగా కొనసాగే అర్హత వైసీపీకి లేదని ధ్వజమెత్తారు. ఆ పార్టీ అనుమతులపైన ఎలక్షన్ కమిషన్ కూడా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి హత్య వెనక ఆ పార్టీ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. ఐదేళ్ల అధికారాన్ని అడ్డుపెట్టుకొని దోచుకోవడం, దాచుకోవడమే జగన్ పార్టీ చేసిందని విమర్శించారు. మంగళవారం అమరావతి వేదికగా మంత్రి పార్థసారథి వి డియాతో మాట్లాడారు. చీకట్లో చంపడం.. పగలు వెళ్లి పరామర్శించడం వైసీపీ నేతలకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. పెద్ద దస్తగిరి ఇంట్లో వందల కోట్ల విలువ చేసే డాక్యుమెంట్లు దొరికాయని మంత్రి కొలుసు పార్థసారథి ప్రస్తావించారు. జగన్ మేనమామ, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి కుటుంబ సభ్యుల పేరు ద ఉన్న ఆస్తుల డాక్యుమెంట్లు, హత్యకు గురైన పెద్ద దస్తగిరి ఇంట్లో ఎలా లభించాయని ప్రశ్నించారు. హత్యకు గురైన పెద్ద దస్తగిరి.. కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి అత్యంత ముఖ్యుడని చెప్పుకొచ్చారు. ఆస్తులు, అధికారం కోసం వైసీపీ నేతలు ఎంతకైనా దిగజారుతారని విమర్శించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య నుంచి, పెద్ద దస్తగిరి హత్య వరకు వైసీపీ ఒకే తరహా నాటకమాడుతోందని ఎద్దేవా చేశారు. పెద్ద దస్తగిరి హత్యకు ప్రధాన కారకులైన వారు.. ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. వైసీపీ నేతలు చేసిన పాపాలను ప్రజలు క్షమించరని హెచ్చరించారు. వైసీపీని ఒక రాజకీయ పార్టీగా ప్రజలు చూడటం లేదని.. రాజకీయాల్లో కొనసాగే అర్హత ఆ పార్టీకి లేదని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ధనదాహం, అధికారదాహానికి ఎవరు అడ్డొచ్చినా తల్లైనా, చెల్లైనా, బాబాయ్ అయినా ఎవరైనా ఒకటేనని ఎద్దేవా చేశారు. జగన్ క్రిమినల్ రాజకీయాలు చేస్తున్నారనే విషయాన్ని.. వైసీపీ కార్యకర్తలు ఇప్పటికైనా ఆలోచించాలని అన్నారు. పెద్ద దస్తగిరి హత్య, బాబాయ్ హత్య, జగన్ కారు చక్రాల కింద నలిగిన కార్యకర్త ఇలా ఎన్నో ఉదాహరణలు జగన్ నైజాన్ని బహిర్గతం చేస్తున్నాయని తెలిపారు. జగన్ సన్నిహితుడు నిత్యానంద రెడ్డి సొంత పార్టీకి చెందిన దస్తగిరిని హత్య చేయటం జగన్ స్వార్ధాన్ని తెలుపుతోందన్నారు. తాడేపల్లిలో తనకున్న అనుబంధంలో భాగంగానే దస్తగిరి హత్య జరిగిందని ఆరోపించారు. హింసా రాజకీయాలు నడిపే వారికి రాష్ట్రంలో చోటు లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి.. వైసీపీకి ఏపీలో చోటు లేకుండా చేయాలని మంత్రి సూచించారు.

## ఫార్మాసిటీ భూముల్లో సాగు కుదరదు

**రైతులను హెచ్చరించిన అధికారులు**

**క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన**

రంగారెడ్డి :
ఫార్మాసిటీ భూములకు సంబంధించి రంగారెడ్డి జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులు ఇకపై అక్కడ వ్యవసాయం చేయకూడదని స్పష్టం చేసింది. ఈ మేరకు అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులకు అవగాహన కల్పించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలోని ఫార్మాసిటీ కోసం సేకరించిన భూములను ఆర్డీవో అనంతరెడ్డి శనివారం స్వయంగా పరిశీలించారు. నానక్ నగర్, మేడిపల్లి, కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాల్లో పర్యటించిన ఆయన.. అక్కడి అసైన్డ్ భూముల స్థితిగతులను అంచనా వేశారు. జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి జారీ చేసిన తాజా ఆదేశాలను ఈ సందర్భంగా రైతులకు వివరించారు. గతంలోనే ఫార్మాసిటీ నిర్మాణం కోసం ప్రభుత్వం సుమారు 14 వేల ఎకరాలకు పైగా భూమిని సేకరించింది. ఈ భూములకు సంబంధించి రైతులకు ఇప్పటికే పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించడం జరిగిందని ఆర్డీవో గుర్తుచేశారు. ప్రభుత్వం నుంచి పరిహారం అందుకున్న రైతులు, రాబోయే వర్షాకాలం సీజన్‌లో సేకరించిన భూముల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ విత్తనాలు వేయకూడదని, ఎలాంటి పంటలు సాగు చేయవద్దని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నష్టపరిహారం పొందిన తర్వాత ఆ భూమిపై హక్కులు ప్రభుత్వానికే ఉంటాయని, కాబట్టి అక్కడ వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొన్నారు. రైతులు అధికారుల సూచనలను పాటించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ పర్యటనలో స్థానిక తహశీల్దార్ అయ్యప్పతో పాటు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. హైదరాబాద్ శివార్లలో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఫార్మాసిటీ ప్రాజెక్టుపై గత కొంతకాలంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ.. భూముల స్వాధీనం విషయంలో ప్రభుత్వం పక్కాగా వ్యవహరిస్తోంది. గతంలో భూసేకరణ సమయంలో కొన్ని గ్రామాల రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ.. మెజారిటీ రైతులకు పరిహారం అందించి భూమిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ భూములను అభివృద్ధి పనులకు సిద్ధం చేస్తున్న తరుణంలో.. అక్కడ మళ్లీ సాగు చేపడితే పనులకు ఆటంకం కలుగుతుందనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం ఈ నిర్ణయం తీసుకుంది. రైతులు ఎవరైనా ఆదేశాలు ధిక్కరించి సాగు చేస్తే చట్టపరమైన

## మహిళా బిల్లు వీగడానికి కాంగ్రెస్ కారణం

**రాహుల్ తీరుపై మండిపడ్డ ఎంపి అరుణ**

మహబూబ్‌నగర్ :
లోక్‌సభలో ఇటీవలే మహిళల రిజర్వేషన్ బిల్లు వీగిపోవడానికి కాంగ్రెస్ ప్రధాన ముద్దాయి అని మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. విపక్షాలతో కలసి మహిళా బిల్లును అడ్డుకుని సాధించేదేంటని అన్నారు. బిల్లు వీగిపోవడంతో అధికార ఎన్డీయే పార్టీలు.. ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీలకు మహిళలు అంటే చిన్నచూపని, చట్టసభల్లోకి మహిళలు రావడం అంటే ఇష్టం లేదంటూ ఎన్డీయే పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా విపక్షాలు కుట్రపూరితంగా అడ్డుకున్నాయని ఎంపీ డీకే అరుణ తెలిపారు. దేశాన్ని ఉత్తర, దక్షిణ భారతదేశం పేరుతో విడగొట్టే చర్యలకు పూనుకుంటున్నాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ పార్లమెంటులో హుందాగా వ్యవహరించలేదని, మహిళా రిజర్వేషన్ వల్ల ప్రధాని మోదీకి మంచి పేరు వస్తుందనే అడ్డుకున్నారంటూ ఎంపీ అరుణ మండిపడ్డారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది. మహిళలను అవమానపరిచిన కాంగ్రెస్ పార్టీకి సమయం వచ్చినప్పుడు బుద్ధిచెప్పాలి. జీడీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. హైదరాబాద్‌లో అధికంగా సీట్లు పెరగాలనే ఉద్దేశమా అని అన్నారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనేది కేవలం అపోహనే అన్నారు. ఈనెల 24న గవర్నర్ శివప్రతాప్ శుక్లా మహబూబ్ నగర్‌లో పర్యటించనున్నారు. 'ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ'లో గెలుపొందిన క్రీడాకారులకు గవర్నర్ బహుమతులు ప్రదానం చేస్తారు' అని ఎంపీ అరుణ వెల్లడించారు. ఆయన పర్యటనకు ప్రజలు హాజరు కావాలన్నారు.

# ఔను.. లాయర్లతో మాట్లాడడానికే ఢిల్లీ వెళ్లా

ఆ కేసు గురించి కూడా న్యాయవాదులతో చర్చించాం అన్నారు. ఈ కేసులో అప్పటి ముఖ్యమంత్రి, హోం మంత్రి కూడా ఇంప్లీడ్ అయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హోంశాఖ తరఫున అనామక లాయర్‌ను పెట్టారు. నిందితుల తరఫున పేరు మోసిన లాయర్ ముకుల్ రోహత్గీని పెట్టుకున్నారు. రేపటి విచారణలో ముద్దాయిగా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నారు. గత నాలుగున్నరేళ్లుగా ఆయన స్టే వి ద ఉన్నారు. రేవంత్‌రెడ్డి దిల్లీలో రాత్రి రాహుల్‌గాంధీతో, ఉదయం భాజపా వాళ్లతో తిరిగారు. కేసీఆర్ నిన్న బయటికి వచ్చినందుకే రెండో విడత రైతు భరోసా విడుదల చేశారు. పంట పెట్టుబడిగా ఇవ్వాల్సింది.. పంట చేతికి వచ్చాక వేశారు. కాళేశ్వరం మొత్తం కూలిపోయిందని ఇన్నాళ్లు దుష్ప్రచారం చేశారని హరీశ్‌రావు అన్నారు. నేను ఢిల్లీ వెళ్తే సీఎంవో నుంచి లీకులు ఇచ్చారు. విషయం లేనివారే ఇలాంటి ప్రచారాలు చేస్తారు. నా ఢిల్లీ పర్యటనలో ఎలాంటి దాపరికం లేదు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచే ఢిల్లీకి వెళ్లా. ఫిరాయింపుల కేసుపై చర్చించేందుకే ఢిల్లీ వెళ్లాం' అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు మాజీ మంత్రి హరీశ్ రావు వెల్లడించారు.జగిత్యాలలో బీఆరఎస్ సభ సమయానికే కాంగ్రెస్ సభ పెట్టడంపై మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లుందని సెటైర్లు వేశారు. కేసీఆర్ స్థాయి ఏంటో, రేవంత్ స్థాయి ఏంటో ప్రజలకు తెలుసన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ వైపే ఉన్నారన్నారు. జగిత్యాల సభలో కేసీఆర్ హుందాగా మాట్లాడారని తెలిపారు. నిన్నటి సభలో రేవంత్ పేరును కేసీఆర్ లేవనెత్తారా అని ప్రశ్నించారు. కానీ రేవంత్ పదేపదే క ఎసిఆర్ పేరు ఎత్తడం, ఆయనకున్న భయాన్ని గుర్తు చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆరఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ ఇప్పటికైనా హుందాగా మాట్లాడితే వచ్చే ఎన్నికల్లో కనీసం డిపాజిట్లయినా దక్కుతాయని మాజీ మంత్రి హితవుపలికారు. మిగిలిన రెండున్నరేళ్లయినా మంచి పాలన అందించాలని సూచించారు.కేసీఆర్ సభకు పోటీగా సీఎం రేవంత్ రెడ్డి నిన్న సభ పెట్టి తన కురచ బుద్ధి బయట పెట్టుకున్నాడని విమర్శించారు. జగిత్యాలలో కేసీఆర్ సభను ముందుగానే నిర్ణయించామని.. కానీ సంకుచిత మనస్తత్వంతో రేవంత్ రెడ్డి పోటీగా సభ పెట్టారని అన్నారు. కేసీఆర్ మాట్లాడే సమయానికి మైక్ పట్టుకున్నాడని విమర్శించారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లుగా రేవంత్ రెడ్డి తీరు ఉందని ఎద్దేవా చేశారు. సోషల్‌మీడియాలో కేసీఆర్ ప్రసంగాన్ని 36లక్షల మంది లైవ్ చూశారని హరీశ్‌రావు తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని కనీసం 4 లక్షల మంది కూడా చూడలేదని అన్నారు. కాంగ్రెస్ అఫిషియల్ సైట్‌లో కేవలం 54 మంది చూశారని పేర్కొన్నారు. రేవంత్ స్థాయి ప్రజలకు అర్థమైందని అన్నారు. ఇప్పటికైనా నీ స్థాయి తెలుసుకో అని రేవంత్ రెడ్డికి హితవు పలికారు. కేసీఆర్ ప్రసంగం అంతా హుందాగా ఉందని హరీశ్‌రావు తెలిపారు. కేసీఆర్ రేవంత్ రెడ్డి పేరు కూడా తీయలేదని పేర్కొన్నారు. కానీ రేవంత్ రెడ్డి ఎంతో ఫ్రస్టేషన్‌తో మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రసంగం స్ట్రీట్ మెన్ కంటే ఘోరంగా ఉందని విమర్శించారు. రేవంత్ రెడ్డి స్పీచ్‌ను ప్రజలు చూడలేదంటేనే స్టేట్ మూడ్ తెలిసిపోయిందని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సూచనలు పాటించి.. రెండున్నరేళ్లలోనైనా సరిగ్గా పనిచేస్తే కనీసం డిపాజిట్లు అయినా దక్కుతాయని అన్నారు. కేసీఆర్ వ్యాఖ్యలను బాధ్యతగా తీసుకుంటే బాగుంటుందని అన్నారు.

# జేఈఈ మెయిన్ ఫలితాల్లో శ్రీచైతన్య అద్భుత విజయం








**హైదరాబాద్, ఏప్రిల్ 21 (నినాదం)**

జేఈఈ మెయిన్ 2026 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యాసంస్థలు మరోసారి అద్భుత విజయాన్ని నమోదు చేశాయి. ఓపెన్ కేటగిరీలో ఇద్దరు విద్యార్థులు 300కు 300 మార్కులతో ఆల్ ఇండియా 1వ ర్యాంక్ సాధించడం విశేషం. అదేవిధంగా టాప్ 10లో పలువురు ర్యాంకులు, టాప్ 100 మరియు 1000లో అత్యధిక స్థానాలు శ్రీచైతన్య విద్యార్థులే దక్కించుకోవడం గమనార్హం.బీ.వి.సి శేఖర్ రెడ్డి, పసల మోహిత్ వంటి విద్యార్థులు పూర్తి మార్కులతో మెరిసిపోగా, ఇతరులు కూడా జాతీయ స్థాయిలో అగ్రస్థానాలను సాధించారు. అలాగే చైతన్య అకాడమీ విద్యార్థులు AIR 98, 107, 396, 826 వంటి ఉత్తమ ర్యాంకులను అందుకున్నారు.ఈ సందర్భంగా అకాడమిక్ డైరెక్టర్ శ్రీమతి సుష్మ బొప్పన మాట్లాడుతూ, వరుసగా మూడు సంవత్సరాలుగా 300/300 స్కోర్లు సాధిస్తూ హ్యాట్రిక్ రికార్డ్ సృష్టించడం సంస్థ ప్రత్యేకత అని తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న మైక్రో షెడ్యూల్స్, నిరంతర ఇంటర్నల్ పరీక్షలు, అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, అలాగే ఆధునిక టెక్నాలజీ ఆధారిత లెర్నింగ్ ప్లాట్‌ఫామ్స్ ఈ విజయానికి వెన్నెముకగా నిలిచాయని చెప్పారు.ఇన్ఫినిటీ లెర్న్ ఆన్‌లైన్ యాప్ కూడా విద్యార్థుల ప్రగతిలో కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. విజయం సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు అధ్యాపక బృందాన్ని శ్రీచైతన్య యాజమాన్యం అభినందించింది.



# జిల్లాలో 4 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

## కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్

**కోదాడ, ఏప్రిల్ 21(నినాదం):**

యాసంగి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా సుమారు నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగే అవకాశం ఉందని ప్రాథమిక అంచనా వేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవర్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మొత్తం 340 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.కోదాడ మండలం తమ్మర బండ పాలెం గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి ఏర్పాట్లు, ధాన్యం నిల్వ, తూకం ప్రక్రియ, రవాణా సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి కొనుగోలు కేంద్రంలో తగిన మౌలిక సదుపాయాలు, తూకం యంత్రాలు, గోదాములు, తాగునీరు, నీడ సౌకర్యం, రవాణా ఏర్పాట్లు సిద్ధంగా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని స్థాయిల్లో పర్యవేక్షణ కొనసాగుతుందని చెప్పారు. కొనుగోలు ప్రక్రియను వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు. రైతులు కేంద్రాల్లో క్రమశిక్షణ పాటిస్తూ సహకరించాలని కోరారు. ఆయన వెంట ఆర్డీఓ సూర్యనారాయణ ఎమ్మార్వో వాజిద్ అలీ ఏవో రజిని సంబంధిత అధికారులు ఉన్నారు.




# జేఈఈ మెయిన్‌లో అలెన్ విద్యార్థుల ప్రతిభ

**హైదరాబాద్, ఏప్రిల్ 21 (నినాదం)**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన జేఈఈ మెయిన్ 2026 ఫలితాల్లో అలెన్ కెరీర్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రిషి ప్రేమ్‌నాథ్ 100 పర్సంటైల్ సాధించి ఆల్ ఇండియా 8వ ర్యాంక్ పొందాడు.సౌత్ జోన్ జోనల్ హెడ్ మహేష్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం, సామవేదం రఘు కపిష్ అక్షిత్ 99.9976982 పర్సంటైల్‌తో AIR-76 ర్యాంక్ సాధించాడు. అలాగే సెంటర్ హెడ్ సౌరవ్ తివారీ ప్రకారం, నియువ్ కొచేటా 99.9962271 పర్సంటైల్‌తో AIR-104 ర్యాంక్ పొందాడు.అలెన్ సీఈఓ నితిన్ కుక్రేజా మాట్లాడుతూ, జేఈఈ మెయిన్ 2026లో సంస్థ మరోసారి తన ప్రతిభను నిరూపించుకుందని, దేశవ్యాప్తంగా నాలుగు మంది రెగ్యులర్ క్లాస్‌రూమ్ విద్యార్థులు టాప్-10లో నిలిచారని తెలిపారు.




# కల్తీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి

## విత్తనాలు అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

**నల్గొండ ప్రతినిధి ఏప్రిల్ 21 (నినాదం)**

కల్తీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. మంగళవారంనల్గొండ జిల్లాలో విత్తన డీలర్లు, సహకార సంఘాల ప్రతినిధులతో కలెక్టర్ ఆఫీసు మీటింగ్ హాల్ లో జరిగిన సమీక్షా సమావేశంలో విత్తనాభివృద్ధి సంస్థ చ) పాల్గొని కీలక సూచనలు చేశారు. జిల్లాలో సుమారు 5 లక్షల ఎకరాల్లో వరి సాగు జరగనుండగా, ఇందుకు దాదాపు 1.25 లక్షల క్వింటాళ్ల విత్తన అవసరం ఉందని అంచనా. ఇందులో భాగంగా తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా సుమారు 50 వేల క్వింటాళ్ల విత్తనాలను సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. వరి విత్తనాలతో పాటు పెసర, మినుము, కంది వంటి పంటల విత్తనాల సరఫరాకూ చర్యలు చేపట్టింది.రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు ఉత్పత్తి ధృవీకరణ వరకు ప్రతి దశలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆధునిక ప్రయోగశాలల్లో పరీక్షలు పూర్తి చేసిన విత్తనాలనే మార్కెట్లో అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు.వరి సాగుకు అవసరమైన సన్న మరియు దొడ్డు రకాల విత్తనాలను సరిపడా నిల్వలో ఉంచినట్లు ఆయన వెల్లడించారు. ముఖ్యంగా మార్కెట్లో డిమాండ్ ఉన్న వివిధ రకాల విత్తనాలను ముందుగానే సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం అనుమతించిన విత్తనాలనే విక్రయించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రైవేట్ విత్తనాలపై అధికంగా ఆధారపడకుండా రైతులను రక్షించడం అందరి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. అలాగే సహకార సంఘాలు అన్ని రకాల విత్తనాల పంపిణీలో చురుకుదనం ప్రదర్శించాలని సూచించారు. ప్రస్తుతం రాయితీ విత్తనాల పైనే దృష్టి పెట్టడం సరికాదని, రాయితీ లేని విత్తనాలను కూడా రైతులకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. వానాకాలానికి అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలను కూడా సమయానికి సరఫరా చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. రాబోయే కొత్త విత్తన చట్టం ద్వారా కల్తీ విత్తనాలపై నియంత్రణ పెరిగి, నిజాయితీ గల డీలర్లు మరియు రైతులకు రక్షణ కలుగుతుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ జిల్లా వ్యవసాయ శాఖ శాఖ అధికారులు శ్రవణ్ కుమార్, విత్తనాభివృద్ధి సంస్థ సిబ్బంది, డీలర్లు మరియు సహకార సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# స్థానిక పోరుకు కాంగ్రెస్ శంఖారావం

## నాయకులు వర్గపోరు వీడాలి... మంత్రి దామోదర రాజనర్సింహ

### మహిళా బిల్లుపై బీజేపీ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి పిలుపు






**సంగారెడ్డి ప్రతినిధి, ఏప్రిల్ 21(నినాదం):**

సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం మంగళవారం పట్టణంలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో అత్యంత ఉత్సాహభరితంగా జరిగింది. డీసీసీ అధ్యక్షురాలు, టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు, పఠాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొని పార్టీ బలోపేతంపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు వెళ్ళినప్పుడే అఖండ విజయాలు సాధ్యమవుతాయని అన్నారు. ఇప్పటికే సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్నామని, అదే స్ఫూర్తిని వచ్చే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లోనూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. నాయకుల మధ్య చిన్నపాటి అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ, వర్గ పోరుకు తావు లేకుండా పార్టీ ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన 70 వేల ఉద్యోగాల భర్తీ, రైతు బంధు, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలను గ్రామగ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. అలాగే 200 కోట్లతో సింగూరు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని, వైద్య రంగంలో డిజిటల్ హెల్త్ కార్డులు అందిస్తూ విప్లవాత్మక మార్పులు తెస్తున్నామని వివరించారు. నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, మహిళా బిల్లు విషయంలో బీజేపీ పన్నుతున్న కుట్రలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ మహిళా రిజర్వేషన్లకు అనుకూలమేనని, అయితే బీజేపీ కావాలనే అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. పార్టీలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారికి తగిన గుర్తింపునిస్తూ, మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పదవుల భర్తీలో కొత్తవారికి అవకాశం కల్పించాలని అభిప్రాయపడ్డారు. ఎంపీ సురేష్ షెట్కార్, నీలం మధు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, కుల గణన ద్వారా అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్పర్సన్ సునీతా పాటిల్, పిసిసి ప్రధాన కార్యదర్శులు తోపాజి అనంత్ కిషన్, చిన్నా ముదిరాజ్, నాయకులు శశికళా యాదవ్ రెడ్డి, సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ కూన వనితా సంతోష్, సదాశివపేట మున్సిపల్ చైర్మన్ అంజమ్మ సత్యనారయణ, కొహీర్, జోగిపేట మున్సిపల్ చైర్మన్ లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్ హరిత



**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 21(నినాదం)**

జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియను రెండు వారాల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవనంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్ రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి తదితరులతో కలిసి ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల పరిధిలోని అన్ని మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు, సెర్ప్ ఏపీఎంలు, వీఓఏలు, సూపర్వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో చేపట్టనున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఓటరులను 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ చేయడంతో పాటు ఇంకా మ్యాపింగ్ కాని వారి వివరాలను సేకరించి, వారు వచ్చిన ప్రాంతాల సమాచారం ఆధారంగా భారత ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియలో పంచాయతీ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, వీఓఏలు, సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేసి శాతం వందకు పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. ప్రతిరోజూ పురోగతిని పర్యవేక్షిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తహసిల్దార్లు, ఎంపీడీవోలు, వీఓఏలు, సూపర్వైజర్లు, సెర్ప్ ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ డిఎస్పీగా ఆనంద్ రెడ్డి



**మిర్యాలగూడ, ఏప్రిల్ 21(నినాదం ):**

మిర్యాలగూడ డిఎస్పి కె.రాజశేఖర్ రాజ్ హైదరాబాద్ సిఐడి విభాగానికి బదిలీ కాగా ఆయన స్థానంలో ఇంటిలిజెన్స్ డిఎస్పీగా పని చేస్తున్న టీ.ఆనందరెడ్డి మిర్యాలగూడ డిఎస్పీగా బదిలీపై రానున్నారు. ఈ మేరకు రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ బి. శివధర్ రెడ్డి ఈ నెల 20న ఆదేశాలు జారీ చేశారు. ఆనంద్ రెడ్డి మిర్యాలగూడకు సుపరిచితులు. మిర్యాలగూడ అవిభాజిత పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ గా, కొన్నాళ్ళ తర్వాత పదోన్నతి పొందిన అనంతరం మిర్యాలగూడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా పని చేశారు. దేవరకొండ డిఎస్పీగా పని చేశారు.

# పర్యావరణ సంరక్షణే లక్ష్యం

## జిల్లా కలెక్టర్ ప్రావిణ్య అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే సందర్భంగా గోడ పత్రిక ఆవిష్కరణ



**సంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 21 ( నినాదం)**

అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే పక్షాన్ని పురస్కరించుకుని, "99 రోజుల ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను మంగళవారం కలెక్ట్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ పాండుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. "భూమిని కాపాడుకుందాం", "ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం", "పచ్చదనం పెంచుదాం" వంటి నినాదాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రకృతి సంపదను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించగలమని తెలిపారు.అలాగే, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, చెట్ల పెంపకం చేపట్టడం, నీటి వనరులను సంరక్షించడం వంటి చర్యలను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, యువత పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.అందరూ కలిసికట్టుగా కృషి చేస్తేనే భూమి సంరక్షణ సాధ్యమవుతుందని, పర్యావరణ హిత చర్యలను నిరంతరం కొనసాగించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, ఎన్జిసి జిల్లా సమన్వయ కర్త మాధవ రెడ్డి, సెక్రటరీ శ్రీనివాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉంది

## రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్

## ఐకెపి సెంటర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్





**గోదావరిఖని ఏప్రిల్ 21 (నినాదం):**

రామగుండం నియోజకవర్గం: మంగళవారం సాయంత్రం పాలకుర్తి మరియు అంతర్గం మండలాల్లో మంగళవారం సాయంత్రం ఐకెపి సెంటర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఘనంగా ప్రారంభించిన రామగుండం నియోజకవర్గ శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గారు.. రైతులు పండించిన ధాన్యాన్ని సరైన ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఉద్దేశంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని, మధ్యవర్తుల వల్ల రైతులు నష్టపోకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయించుకోవాలని రైతులకు సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి రైతు ఆర్థికంగా బలపడేలా అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్, స్థానిక నాయకులు, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు మరియు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేవరకొండ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో భారీ మోసం

## నలుగురు నిందితుల అరెస్టు: జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

## రూ.2,42,10,000/- నగదు, 6 స్మార్ట్ మొబైల్ ఫోన్లు, 1 ల్యాప్‌టాప్ స్వాధీనం







**నల్లగొండ ప్రతినిధి ఏప్రిల్ 21( నినాదం)**

దేవరకొండ టౌన్ పరిధిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బిఐ) ఏసీబీ బ్రాంచ్ లో భారీ ఆర్థిక మోసం కేసును దేవరకొండ పోలీసులు సమర్థవంతంగా ఛేదించి, నలుగురు నిందితు లు, 2.42.10.000,ఆరు స్మార్ట్ ఫోన్లు, ఒక లాప్టాప్ ను స్వాధీనపరుచుకున్నట్లు జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 13న దేవరకొండ ఎస్బిఐ, ఏసీబీ బ్రాంచ్లో మేనేజర్ గా పనిచేస్తున్న ఫిర్యాదు మేరకు తమ బ్యాంక్ లో కాంట్రాక్ట్ బేసిక్ హౌస్ కీపింగ్ ఉద్యో గిగా పనిచేస్తున్న లెండల చక్రపాణి అనే వ్యక్తి బ్యాంక్ లోని ఇనాక్టివ్ ఖాతాల వివరాలను దుర్వినియోగం చేసి, నాన్-బ్రాంచ్ కేవైసీ అప్డేట్ ప్రక్రియను అక్రమంగా ఉపయోగించి, ఆ ఖాతాల నుండి మొత్తం రూ. 2,65,55,268/- (రెండు కోట్ల అరవై ఐదు లక్షల యాభై ఐదు వేల రెండు వందల అరవై ఎనిమిది రూపాయలు) నగదును మోసపూరితంగా బదిలీ చేసినట్లు పిర్యాదులో తెలియజేశారు. దేవరకొండ డీఎస్పీ ఎం.వి. శ్రీనివాస రావు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేసి, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి. వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సమన్వయంతో సాంకేతిక శాస్త్రీయ ఆధారాలను సేకరించి, వివిధ ప్రాంతాల్లో దర్యాప్తు చేపట్టి నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకోవడం జరిగిందని అన్నారు. లెండల చక్రపాణి, పుట్ట వెంకట రామాంజనేయులు, ఎస్బిఐ రికవరీ ఏజెంట్, మిర్యాలగూడ శివ, తండ్రి: వెంకయ్య, లెండల చక్రపాణి, గత 5 సంవత్సరాలుగా ఎస్బిఐ బ్యాంక్ లో కాంట్రాక్ట్ హౌస్ కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తూ, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండటం వలన బ్యాంక్ సిబ్బందికి కంప్యూటర్ పనుల్లో సహాయం చేసేవాడు. ఈ విధంగా అతనికి బ్యాంక్ లోని అంతర్గత వ్యవస్థలు ఖాతాల నిర్వహణ విధానాలపై అవగాహన ఏర్పడింది.అతనికి సూర్యపేట మెయిన్ బ్రాంచ్ లో పనిచేసే బ్యాంక్ మేనేజర్ పుట్ట వెంకట రామాంజనేయులు తో పరిచయం ఏర్పడింది. కుటుంబ ఆర్థిక ఇబ్బందులు అప్పుల కారణంగా అక్రమంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్న చక్రపాణి, రామాంజనేయులు తో కలిసి ఈ మోసానికి ప్రణాళిక రూపొందించాడు.రామాంజనేయులు తన అధికార పరిధిలో ఉన్న ఎం ఐ ఎస్, ద్వారా గత కొన్ని సంవత్సరాలుగా ఎటువంటి ట్రాన్సాక్షన్ లు జరగని డబ్బులు ఉన్న 10 ఇనాక్టివ్ బ్యాంక్ ఖాతాల వివరాలను సేకరించాడు.తదుపరి ఆ ఖాతాదారుల పేరు, చిరునామా, ఆధార్, పై పెన్ను , ఫోటో, సంతకం వివరాలను సేకరించి, రేఖప్రింట్ . ఇంఫ్రా సైట్ ఆధారంగా నకిలీ ఆధార్ కార్డులను తయారు చేశారు.బ్యాంక్ ఉద్యోగుల లాగిన్ వివరాలను గమనించి, రద్దీ సమయాల్లో కంప్యూటర్ లోకి లాగిన్ అయి, ఖాతాలకు కొత్త మొబైల్ నంబర్ అప్డేట్ చేశారు.అనంతరం యోనా అప్ ద్వారా కొత్త యూసర్ ఐడి , పాస్వర్డ్ పిన్ సృష్టించారు.ఆ ఖాతాల నుండి నగదును ఇతర వ్యక్తుల ఖాతాలకు ఆన్‌లైన్ ద్వారా బదిలీ చేశారు.తదుపరి, నిందితులు రాంలాల్, శివ తమ పరిచయస్తుల ద్వారా వారికి తెలిసిన వ్యక్తుల నుండి మీ అకౌంట్ లోకి డబ్బులు వస్తాయి, మీరు నగదు ఇవ్వండి.. ఇది లీగల్ ట్రాన్సాక్షన్ అని నమ్మబలికి, కమిషన్ ఆశ చూపించి వారి బ్యాంక్ ఖాతా వివరాలను సేకరించారు.ఈ విధంగా అక్రమంగా సంపాదించిన మొత్తాన్ని 45 శాతం లెండల చక్రపాణి, పుట్ట వెంకట రామాంజనేయులు,10 శాతం కేతవత్ రాంలాల్, మారేపల్లి శివ వాటాలుగా పంచుకునే విధంగా ముందుగానేనిర్ణయించుకున్నారుఈ మోసం వెలుగులోకి రావడానికి కారణం, పల్లటి నరేందర్ అనే ఖాతాదారునికి చెందిన కోటి, హైదరాబాద్ బ్రాంచ్ ఖాతాలో అక్రమంగా కేవైసీ అప్డేట్ చేయబడినప్పుడు, అతనికి ఇ-మెయిల్ ద్వారా అలర్ట్ మెసేజ్ వెళ్లింగా వెంటనే బ్యాంక్ ను సంప్రదించడంతో అసలు విషయం బయటపడింది. కేసును .బి రాజు, సబ్ ఇన్స్పెక్టర్, దేవరకొండ,కానిస్టేబుల్స్ L. వీరబాబు, పోలీస్ కానిస్టేబుల్ ఎండీ . ఫయాజ్, ఎస్.కె . చాంద్ పాషా,వి. సింహాద్రి, హోం గార్డ్,సోమ్లా, హోం గార్డ్ (డ్రైవర్)లను సమర్థవంతంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేసినందుకు అబినందించారు

# వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

## జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జ్యోతి



**సంగారెడ్డి బ్యూరో, ఏప్రిల్ 21 (నినాదం )**

ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ జ్యోతి స్థానిక మహిళా శక్తి పెట్రోల్ బంక్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె పెట్రోల్ బంక్‌లో అందిస్తున్న సేవలను, నిర్వహణను సమగ్రంగా పరిశీలించారు. ముఖ్యంగా ప్రజలకు అందుబాటులో ఉన్న టాయిలెట్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, అవి ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని, ప్రతిరోజూ క్రమం తప్పకుండా శుభ్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. అదేవిధంగా, పెట్రోల్ బంక్‌కు సంబంధించిన రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు, అమ్మకాల వివరాలు తదితర పుస్తకాలను పరిశీలించి, అన్ని వివరాలు పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. పెట్రోల్ బంక్ లావాదేవీలను సమగ్రంగా పరిశీలించి, పూర్తి స్థాయి రీకన్సిలియేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో భాగంగా పరిశుభ్రత, పారదర్శకత, బాధ్యతాయుత నిర్వహణ చాలా కీలకమని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాల్సిన బాధ్యత ప్రతి సంస్థపై ఉందని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో సంబంధిత అధికారులు, పెట్రోల్ బంక్ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వాతావరణ హెచ్చరికలు గుణపాఠం కావాలి !

సంపాదకీయం

భగభగమండుతున్న ఎండలు తెలుగు రాష్టా ల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఎండల తీవ్రత విపరీతంగా ఉంది. దీనికితోడు ఈ యేడు వర్షాలు కూడాతక్కువేనని వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరించింది. వాతావరణ అసమతుల్యత కారణంగా ఇలా జరుగుతోంది. ఏటా హెచ్చరికలు వస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రజలకు బాధ్యత లేకుండా పోతోంది. అదేపనిగా నదుల్లో నుంచి ఇసుకను తోడేస్తున్నారు. కొండలను పిండి చేస్తున్నారు. అడవులను నరికి వేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి దాపురించింది. బయటకు వెళితే ఎక్కడైనా చెట్టునీడ కనిపించడం లేదు. ఇకపోతే ఇప్పటికే రైతులకు ఎరువులు అందడం లేదు. నీటి పారకం తగ్గింది.వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. నీటిని సక్రమంగా వాడుకునే పద్ధతులు నేటికీ అమలు కావడం లేదు. అధికంగా ఎరువులు వాడకం వల్ల భూసారం తగ్గిపోతోంది. ఒకవైపు అమెరికా యుద్ధోన్మాదం కూడా మన రైతాంగంపై పడుతోంది. మరోవైపు ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉంటుందని, రుతు పవనాలూ మందగిస్తాయని భారత వాతావరణ శాఖ ఈపాటికే హెచ్చరించింది. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ఎల్ నినో పరిస్థితులు తలెత్తటం ఈ ఏడాది వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. మే, జులై నెలల మధ్య వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, అక్టోబరు వరకూ ఉండొచ్చుని అంటున్నారు. దీనివల్ల మనకు ఎక్కువ వర్షపాతాన్నిచ్చే నైరుతి రుతు పవనాలు మందగించి, తీవ్ర వర్షాభావం ఏర్పడవచ్చు. నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికలు రూపొందించి, కార్యాచరణకు పూనుకోవాలి. పరిస్థితులను ముందే గమనించి వచ్చే వర్షాకాలానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి. సాగునీటికి అవసరమైన వర్షాలు ఎలా ఉన్నా మిగతావన్నీ ప్రభుత్వాల సన్నద్ధతతో, ముందు చూపుతో ఆధారపడి ఉన్నాయి. ప్రతి ఏటా పాలకులు నిర్లక్ష్యం వల్ల, విత్తనాలూ, ఎరువులూ సమకూర్చక పోవటం వల్ల రైతులు నానా అగచాట్లకూ గురవుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డెక్కడం, ఆందోళనలకు దిగటం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితులను గుర్తించి ముందుగానే మేల్కొని తగిన సన్నాహాలు చేయడం, సకాలంలో సహాయ సహకారాలు అందివ్వడం పాలకుల సంకల్పం కావాలి. ఏటా ఖరీఫ్ కాలం అన్నదాతకు ఆశలతో పాటు అనేక కష్టనష్టాలను కూడా మోసుకొని రావడం ప్రతి ఏటా చూస్తున్నాం. విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పెట్టుబడి తదితర అవసరాలు నలువైపుల నుంచి చుట్టుముట్టి రైతాంగానికి సమస్యలుగా పరిణమిస్తాయి. ఇవన్నీ కూడా పరిష్కరించదగ్గవే అయినా పాలకులు దృష్టిలోపం కారణంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. కూలీల కొరత కూడా తీవ్రంగా ఉంటోంది. జనాభా అత్యధికంగా ఉన్నా రైతులకు కూలీలు దొరకడం లేదు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోడంతో యువరైతులు వ్యవసాయం వదిలేస్తున్నారు. చిన్న కమతాల్లో కూడా ట్రాక్టరు ఆధారిత వ్యవసాయం నేడు సర్వసాధారణం అయిపోయింది. ట్రాక్టరు, మోటారు వంటి యంత్ర సాధనాలు నడవాలంటే డీజిలు చాలా అవసరం. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధ బీభత్సం చమురు దిగుమతుల పైనా, ఎరువుల తయారీకి ఉపయోగపడే ముడిసరుకు రవాణాపైనా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో పాటు రష్యా, ఇరాన్‌ల నుంచి మన దేశ చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించటం సమస్యగా మారింది. సాధారణ పరిస్థితుల్లోనే మన రైతులకు అవసరమైన పరిమాణంలో ఎరువులను సకాలంలో పంపిణీ చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఇప్పుడున్న ప్రతికూల పరిస్థితుల్లో ప్రత్యేకంగా పూనుకుంటే తప్ప అవసరమైన ఎరువులు, రుణాలు వంటివి సకాలంలో సమాకూరవు. ఇప్పటికే పశ్చిమాసియాలో నెలకొని ఉన్న యుద్ధ వాతావరణంలో రైతాంగానికి ఎంతో నష్టం తెచ్చిపెడుతోంది. రొయ్యలు, బియ్యం, పండ్లు, పూలు వంటి వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ఆగిపోవడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. సాగుకు అవసరమైన పరిస్థితులను కల్పించాలి. వాతావరణ పరిస్థితులు, సాగునీటి లభ్యతలకు అనుగుణంగా ఎక్కడ ఏ పంట వేయాలో వ్యవసాయ శాఖ ద్వారా మార్గనిర్దేశనం చేయాలి. పరిస్థితులకు తగినట్టుగా వ్యవసాయశాఖ ప్రణాళిక రూపొందించాలి. అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు ఏర్పాటు చేయాలి. ప్రత్యేక నిధులు కేటాయించి, ఏ ప్రాంతంలో రైతులకు ఏది అవసరమో అది వెనువెంటనే అందించే సన్నద్ధత, యంత్రాంగ ఏర్పాటూ ఉండాలి. ప్రపంచ పరిస్థితుల్లోనూ, ప్రకృతిలోనూ ప్రతికూలతలు పొటమరిస్తున్న వేళ పాలకులు ముందుచూపుతో సాగాలి. ఇకపోత తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఈ వేసవిలో సమస్య తీవ్రత కనిపిస్తోంది. తెలంగాణ, ఎపిల్లో ఎప్పటికప్పుడు సమస్యలను ఆకళింపు చేసుకుని సాగాలి. ఈ రెండు నెలల పాటు తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

# మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కుంటున్నామా..!

**(ఏప్రిల్ 22న "అంతర్జాతీయ (ప్రపంచ) భూమాత దినోత్సవం" సందర్భంగా)**




ప్రపంచంలోనే అతిపెద్ద పర్యావరణ ఉద్యమమైన అంతర్జాతీయ (ప్రపంచ) భూమాత దినోత్సవం, భూమిని, దాని ఆవరణ వ్యవస్థలను మానవాళి ఉమ్మడి నివాసంగా గుర్తిస్తుంది. ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడానికి, వాతావరణ మార్పులను ఎదుర్కోవడానికి, జీవవైవిధ్య పతనాన్ని ఆపడానికి, దానిని రక్షించాల్సిన అవసరాన్ని ఇది నొక్కి చెబుతుంది. వాతావరణ మార్పులు, ప్రకృతిలో మానవ ప్రమేయ మార్పులు, అలాగే అడవుల నరికివేత, భూ వినియోగ మార్పులు, తీవ్రమైన వ్యవసాయం, పశు పోషణ, పెరుగుతున్న అక్రమ వన్యప్రాణుల వ్యాపారం వంటి జీవ వైవిధ్యానికి భంగం కలిగించే అంశాలు మన గ్రహం యొక్క వినాశన వేగాన్ని పెంచుతున్నాయి. మన భూగ్రహం కేవలం ఒక నివాస స్థలమే మాత్రమే కాదు – అది జీవాన్ని నిలబెట్టే ఒక చైతన్యవంతమైన, పరస్పరం అనుసంధానించబడిన వ్యవస్థ. భూమి సమస్త జీవాలకు అవసరమైన వనరులను అందిస్తుంది, వాతావరణాన్ని నియంత్రిస్తుంది, జీవ వైవిధ్యాన్ని పెంపొందిస్తుంది. శ్వాస తీసుకోవడానికి సారవంతమైన గాలిని, తాగడానికి స్వచ్ఛమైన నీటిని, ఆవాస నివసించడానికి, వ్యవసాయ సాగు చేయడానికి సారవంతమైన భూమిని అందిస్తుంది.

## ప్రపంచ భూమి దినోత్సవం - 2026 యొక్క ఇతివృత్తం:

ఈ అద్భుతమైన గ్రహం యొక్క సహజ సౌందర్యాన్ని ప్రభావితం చేస్తున్న వివిధ తీవ్రమైన పర్యావరణ సమస్యల కారణంగా, ఆరోగ్యకరమైన జీవరాశి, ముఖ్యంగా మానవాళి మనుగడ కోసం పవిత్రమైన భూమాతను పరిరక్షించేందుకు, 1970లో తొలిసారిగా ప్రారంభించబడిన (2009లో ఐక్యరాజ్యసమితిచే గుర్తింపు పొందిన) 56వ అంతర్జాతీయ భూమాత దినోత్సవాన్ని లేదా ప్రపంచ భూ దినోత్సవాన్ని ప్రపంచ మానవాళి 2026 ఏప్రిల్ 22న ప్రతి ఏటా నిర్వహిస్తోంది. ప్రపంచ భూ దినోత్సవం–2026 యొక్క ఇతివృత్తం "మన శక్తి, మన గ్రహం". కంపెనీలు, ప్రభుత్వాలు, సమాజాలు, పౌరులతో సహా అందరూ పర్యావరణాన్ని పరిరక్షించడానికి చర్యలు తీసుకోవడానికి, నూతన ఆవిష్కరణలు చేయడానికి, నిర్ణయాలు అమలు చేయడానికి ఒక ప్రపంచ కూటమిని పటిష్టం చేయాలని లక్షలాది మంది ప్రజలకు గుర్తుచేయడమే దీని ఉద్దేశ్యం. భూమాత మన ఇల్లు, దానిని రక్షించడం మన కనీస బాధ్యత అని గమనించాలి.

## తరతరాలను కాపాడటానికి భూమిని కాపాడండి:

ప్రపంచ భూమి దినోత్సవం సందర్భంగా, వాతావరణ/పర్యావరణ అక్షరాస్యతను ప్రోత్సహిద్దాం. హరిత ఉద్యోగాలను సృష్టిద్దాం. సుస్థిర వినియోగదారుల మార్కెట్‌ను నిర్మిద్దాం. వాతావరణ సంక్షోభాన్ని పరిష్కరిద్దాం. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిద్దాం. జీవవిచ్ఛిన్నమయ్యే ప్లాస్టిక్ ఉత్పత్తుల వాడకాన్ని ప్రోత్సహిద్దాం. హరిత క్షేత్రాల అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిద్దాం. ప్రపంచ పరిశుభ్రతకు దోహదపడదాం. సంప్రదాయేతర లేదా పునరుత్పాదక ఇంధన వనరులను (సౌర, పవన, సముద్రపు నీటి, జల, భూఉష్ణ శక్తులు) వినియోగించుకుందాం. సుస్థిర శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిద్దాం. భూమాత మనుగడకు హానికరమైన అన్ని రకాల కాలుష్యాలను తగ్గిద్దాం. మన గ్రహాన్ని రక్షించుకోవాల్సిన ప్రాముఖ్యతపై అవగాహన పెంచే కార్యక్రమాలను చేపట్టడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న పాలక అధికారులు, పర్యావరణవేత్తలు, ప్రకృతి ప్రేమికులు, విద్యాసంస్థలు, పౌరులను ఏకతాటిపైకి తీసుకురావాలి.

మన ధరణి గ్రహం ఆరోగ్యంతో పాటు మన ఉజ్వల భవిష్యత్తు మన చేతుల్లోనే ఉందని గుర్తుంచుకుందాం. ఈ రోజు మనం తీసుకునే చర్యలే రేపటి మన ఆవాస గ్రహాన్ని తీర్చిదిద్దుతాయి. భూమి, దాని జీవావరణ వ్యవస్థలు మన ఇల్లు కాబట్టి, భూమితో, ప్రకృతితో శాంతిని నెలకొల్పి, ప్రోత్సహించడం ద్వారా మనం భవిష్యత్ తరాల ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను సమతుల్యం చేయాలి. ప్రపంచ భూమి దినోత్సవం నాడు, రాత్రి 8:30 నుండి 9:30 గంటల మధ్య దీపాలు ఆర్పేసి, కొవ్వొత్తులు వెలిగించడం ద్వారా 'ఎర్త్ అవర్'ను పాటిస్తారు. రాబోయే తరాల కోసం ఒక సుస్థిరమైన భవిష్యత్తును నిర్మించడానికి మనమందరం కలిసికట్టుగా కృషి చేద్దాం. మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కో వద్దు, మన బొందను మనమే తవ్వుకోవద్దు.

**మనుషులు రావచ్చు; మనుషులు పోవచ్చు; భూమి మాత్రమే శాశ్వతంగా కొనసాగుతుంది.**

**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

# అభివృద్ధికి సవాలు.. విసురుతున్న టెర్రరిజం



**21వ శతాబ్దంలో మానవాలి ఉగ్రవాద రూపంలో ఎంతో ఉపద్రవాన్ని ఎదుర్కొంటుంది. జాతీయ సరిహద్దులను ఎల్లలను దాటి ఉగ్రవాదం ప్రపంచంలోకి భయంకరంగా మారి సమాజంలో శాంతి సౌభాగ్యాలకు అభివృద్ధికి సవాల్గా మారింది. భారతదేశంలో దాదాపు 205 జిల్లాలు ఉగ్రవాద ప్రభావిత జిల్లాలుగా వందలాదిమంది ప్రాణాలు కోల్పోవడానికి కోట్లాది రూపాయల ఆస్తి నష్టానికి సమాజంలోని వివిధ వర్గాల ప్రజల మధ్య ఉద్రిక్తసలకు దారి తీస్తుంది. భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజల జీవితాలు చిన్నాభిన్నం కావడానికి కారణమైన ఉగ్రవాద సంఘటనలు ఎన్నో ఉన్నాయి. వీటిలో భారత పార్లమెంటుపై జరిగిన దాడి, కాశీంనగర్ మారణకాండ , సంజౌత ఎక్స్ప్రెస్ పై దాడి, ముంబై పై ఉగ్రవాదుల దాడి హైదరాబాదులోని లుంబిని పార్క్ గోకుల్ చాట్ ప్రాంతాల్లో బాంబు విస్ఫోటనాలు జమ్మూకాశ్మీర్లో 2001 నుండి ఈనాటి వరకు జరుగుతున్న ఉగ్రవాద దాడులు ఇలా ఎన్నో ఉగ్రవాద సంఘటనలు పేర్కొనవచ్చు.**

ఉగ్రవాదం అనగా: రాజకీయ సిద్ధాంత భావజాలం లేదా మతపరమైన లక్ష్యాలు సాధించడానికి ఒక క్రమ పద్ధతిలో బల ప్రయోగం చేయడం లేదా బలప్రయోగ హెచ్చరిక చేయడాన్ని ఉగ్రవాదంగా పేర్కొనవచ్చు. ఉగ్రవాదం ప్రపంచంలోని అనేక అనేక దేశాలకు ఘోర ప్రమాదకంగా విపత్తుగా పరిణమించి శాంతి భద్రత సమస్యలను సృష్టిస్తోంది. దేవాలయాలు మసీదులు చర్చిలు మార్కెట్లు రైల్వేస్టేషన్లో అంతస్తుల భవనాలు ఇలా ఎన్నెన్నో ఇతర ప్రాంతాల జన సాంద్రత ఎక్కువగా ఉండడంతో ఉగ్రవాదుల లక్ష్యాలుగా మారాయి. గత మూడు దశాబ్దాలుగా భారతదేశంలోని అనేక రాష్ట్రాలు ఉగ్రవాద దాడులకు సాక్షి భూతంగా నిలిచాయి. వీటిలో పంజాబ్ జమ్మూ కాశ్మీర్ అస్సాం మణిపూర్ త్రిపుర ఛత్తీస్గడ్ తెలంగాణ ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలు తీవ్రవాద ఉగ్రవాద దాడులను చర్యలను ఎదుర్కొంటూనే ఉన్నాయి. ఆయుధాలు మందు గుండు సామాగ్రి ఉగ్రవాదులకు అందుబాటులో ఉండడంతో ఉగ్రవాదం సమాజంలోని బీతాహు పరిస్థితులను సృష్టిస్తోంది. ఉగ్రవాద సమూహాలకు దయా కరుణ నైతికత ఉండవు. ఉగ్రవాద దాడులు చాలావరకు అమాయకపు పౌరులను లక్ష్యంగా ఎంచుకొని కొనసాగుతున్నాయి. భారీ స్థాయిలో ఉగ్రవాదం ప్రాణనష్టాన్ని ఆస్తి నష్టాన్ని మిగులుస్తుంది.

## ఉగ్రవాదం రకాలు:

భారతదేశంలో రెండో పరిపాలన సంస్కరణ సంఘం 2008లో సమర్పించిన నివేదికలు ఉగ్రవాదాన్ని ఐదు రకాలుగా వర్గీకరించారు. ఈ వర్గీకరణ ఉగ్రవాద సంస్థలు సమూహాలు పోరాడే లక్ష్యాలు ఆశయాల ఆధారంగా జరిగింది. ఒకటి తెగల జాతీయ ఉగ్రవాదం, రెండు మత మౌడియ ఉగ్రవాదం, మూడు సిద్ధాంత ఉగ్రవాదం, నాలుగు రాజ్య ప్రయోజత ఉగ్రవాదం 5 మారకద్రవ్య ఉగ్రవాదం. తెగల జాతీయవాద ఉగ్రవాదం: ఉగ్రవాద సమూహాలు భారతదేశ నుండి వేర్పాటును కోరుతూ లేదా భారత సమాఖ్యలో నూతన రాష్ట్రాన్ని డిమాండ్ చేస్తూ ఉగ్రవాద చర్యలకు హింసకు పాల్పడదాన్ని తెగల జాతీయ ఉగ్రవాదంగా పేర్కొనవచ్చు.2. మతమధ్య ఉగ్రవాదం: ఈ తరహా ఉగ్రవాదం మతమార్గవాదం ఆధారంగా జన్మిస్తుంది భారతదేశంలో ఎన్నో ఉగ్రవాద చర్యలు సంఘటనలు దాడులు కిందికి వస్తాయి పాకిస్తాన్ కూడా చాలా సంస్థ ఐఎస్ఐ సహాయంతో ఉగ్రవాద సంస్థలు సమూహాలు ఎన్నో ప్రాంతాల్లో మతమధ్య ఉగ్రవాదానికి పాల్పడుతున్నాయి.3 సిద్ధాంత ఉగ్రవాదం: దీన్ని వామపక్ష తీవ్రవాదం అని వ్యవహరిస్తారు4. సీమాంతర ఉగ్రవాదం: పరుగు రాజ్యాల నుండి పరోక్ష రూపంలో వ్యక్తమయ ఉగ్రవాదాన్ని సీమాంతర ఉగ్రవాదం అంటారు.5. మాదకద్రవ్య ఉగ్రవాదం: ఈ సలహా ఉగ్రవాదం నిషేధించిన మాదకద్రవ్యాలు గంధపు చెట్ల అక్రమ రవాణాపై దృష్టి కేంద్రీకరిస్తుంది.6. పర్యావరణ వినాశక ఉగ్రవాదం: దీనినే జీవరసాయన ఆయుధాల ఉగ్రవాదమని బయో ఉగ్రవాదమని వ్యవహరిస్తారు.7. సైబర్ ఉగ్రవాదం: కంప్యూటర్లు ఇతర సామర్థ్య సమాచార సాధనాల ఉపయోగించి నేరపూరిత చర్యలకు పాల్పడడానికి సైబర్ ఉగ్రవాదంగా పిలుస్తున్నారు.8. ఆత్మహత్య ఉగ్రవాదం: సమాజంలో భారీ స్థాయిలో మారణ హోమాన్ని సృష్టించడానికి ఉగ్రవాద సమూహాలు ఆత్మహతి దళాలను ఆత్మహత్య బాంబులను ఉపయోగించి ఆత్మాహుతి ఉగ్రవాదంగా పేర్కొనవచ్చు.


## ఉగ్రవాద నిరోధక చర్యలు:

ఉగ్రవాద సమస్యను పరిష్కరించడానికి భారత ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టింది. కేంద్రంలోనూ వివిధ రాష్ట్రాలను వరుసగా వచ్చిన ప్రభుత్వాలు ఈ సమస్యపై తీవ్ర సమాలోచనలు జరుపుతూ నిరోధక చర్యలను చేపట్టి అమలు చేస్తున్నాయి. ముఖ్యంగా యువతను తీవ్రవాదం వైపు ఆకర్షితులు కాకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటుంది. ఉగ్రవాద ధోరణులను ఎదుర్కోవడానికి ప్రభుత్వం కఠిన చట్టాలను అమలుపరుస్తుంది. ఉగ్రవాదం నిరోధకయత్నాలను ప్రజల మానవ హక్కుల అంశాలను అతి జాగ్రత్తగా నిర్వహిస్తూ ప్రజల పౌర స్వేచ్ఛలను గౌరవం అందించడానికి ప్రయత్నిస్తుంది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో రూపొందిస్తున్న ప్రపంచ ఉగ్రవాద నిరోధక వ్యూహంలో భాగంగా 2006 నుండి ప్రభుత్వం క్రియాశీలంగా పనిచేస్తుంది. దీనిలో భాగంగా అమెరికా ఫ్రాన్స్ ఆస్ట్రేలియా జర్మనీ తదితర దేశాలతో కలిసి భారత దేశం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మహా మైత్రి కూటమిగా ఆవిర్భవించింది. ఉగ్రవాదాన్ని అణిచి వేయడానికి భారత ప్రభుత్వం రాష్ట్రాల సహాయంతో నిరంతరం కృషి చేస్తూనే ఉంది.

పందిరి: శ్రీనివాసులు. ఎంఏ ( జాగ్రఫీ), బీఈడీ, ఎంసీజే (జర్నలిజం), పీజీ డీసీజే ( జర్నలిజం) ఉస్మానియా యూనివర్సిటీ.

# విద్యా కుసుమాలు - క్రమశిక్షణ ముళ్లు మారుతున్న కాలం.. మారుతున్న చట్టాలు

**గురు శిష్య బంధం: క్రమశిక్షణకు, హక్కులకు మధ్య సమతుల్యత ఏది?**



పాఠశాలలు కేవలం పాఠ్యాంశాల బోధనకు మాత్రమే పరిమితం కాకుండా వ్యక్తిత్వ నిర్మాణానికి, సామాజిక బాధ్యతాభావం పెంపొందించడానికి కీలక కేంద్రాలుగా భావించబడు తున్నాయి. ఈ సందర్భంలో విద్యార్థుల్లో క్రమశిక్షణ అనే అంశం ఎప్పటికీ ప్రాముఖ్యత కోల్పోని మూల్యంగా నిలిచింది. అయితే క్రమశిక్షణ పేరుతో ఉపాధ్యాయులు తీసుకునే చర్యలు ఎంతవరకు చట్టబద్ధం, ఎంతవరకు నైతికంగా సమర్థించదగినవి అన్నది కాలక్రమేణా పెద్ద చర్చా విషయంగా మారింది. తాజాగా కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ చర్చకు మరో కొత్త మలుపు నిచ్చింది. విద్యార్థిని క్రమశిక్షణలో పెట్టేందుకు ఉపాధ్యాయుడు బెత్తంతో కొట్టిన ఘటనలో నమోదైన క్రిమినల్ కేసును కొట్టివేస్తూ కోర్టు చేసిన వ్యాఖ్యలు విద్యా రంగం, న్యాయ వ్యవస్థ, మానవ హక్కుల వర్గాల్లో విస్తృత చర్చకు దారితీశాయి.

తిరువనంత పురంలోని ఒక పాఠశాలలో చోటుచేసుకున్న ఈ ఘటనలో విద్యార్థి అశ్రద్ధగా ప్రవర్తించాడనే కారణంతో ఉపాధ్యాయుడు స్టాఫ్ రూమ్‌లో బెత్తంతో కొట్టాడని ఆరోపణలు వచ్చాయి. దీనిపై పోలీసులు భారతీయ న్యాయ సంహిత (BNS) మరియు జువైనల్ జస్టిస్ (JJ) చట్టాల కింద కేసు నమోదు చేశారు. ఈ సెక్షన్లు సాధారణంగా పిల్లలపై హింస, వేధింపుల కేసుల్లో ఉపయోగించబడే కఠినమైన నిబంధనలు. అయితే ఈ కేసులో ఉపాధ్యాయుడు తన చర్య క్రమశిక్షణ కోసమే జరిగిందని, దానిలో ఎటువంటి క్రూర ఉద్దేశం లేదని వాదిస్తూ హైకోర్టును ఆశ్రయించాడు.

కేసును విచారించిన ధర్మాసనం కొన్ని కీలక అంశాలను పరిశీలించింది. మొదటగా, విద్యార్థికి తలెత్తిన గాయాల తీవ్రత. మెడికల్ రిపోర్టుల ప్రకారం విద్యార్థి శరీరంపై ఎటువంటి గంభీర గాయాలు లేవని తేలింది. ఇది కేసు తీవ్రతను తగ్గించే ప్రధాన అంశంగా కోర్టు పరిగణించింది. రెండవది, ఘటన జరిగిన వెంటనే కాకుండా కొన్ని రోజుల తర్వాత ఆసుపత్రికి వెళ్లడం. దీనిని కోర్టు అనుమానాస్పదంగా భావించింది. మూడవది, ఉపయోగించిన సాధనం—'బెత్తం'. చట్టపరంగా ఇది ప్రమాదకరమైన ఆయుధం కాదని కోర్టు స్పష్టం చేసింది.

ఈ అంశాలన్నింటినీ సమీక్షించిన తరువాత కోర్టు 'మెన్స్ రియా' అనే న్యాయ సూత్రాన్ని ప్రస్తావించింది. అంటే నేరం జరగాలంటే కేవలం చర్య మాత్రమే కాకుండా దాని వెనుక నేరపూరిత ఉద్దేశం కూడా ఉండాలి. ఈ కేసులో ఉపాధ్యాయుడి చర్య క్రమశిక్షణ పరిరక్షణ కోసమే జరిగిందని, దానిలో క్రూరత్వం లేదా ద్వేషభావం కనిపించలేదని ధర్మాసనం అభిప్రాయపడింది. అందువల్ల ఈ చర్యను నేరంగా పరిగణించడం సబబు కాదని పేర్కొంది.

ఈ తీర్పు ద్వారా కోర్టు మరో ముఖ్యమైన అంశాన్ని స్పష్టం చేసింది. ఉపాధ్యాయులకు విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచేందుకు కొంత పరిమిత అధికారాన్ని చట్టం అనుమతిస్తుందని పేర్కొంది. అయితే ఈ అధికారం అపరిమితం కాదు. అది సదుద్దేశంతో, సమంజసమైన పరిమితుల్లో, క్రూరత్వం లేకుండా వినియోగించబడాలి. ఈ సూత్రం ద్వారా కోర్టు ఒక సున్నితమైన సమతుల్యతను సూచించింది—విద్యార్థుల హక్కులను కాపాడుతూ ఉపాధ్యాయుల పాత్రను పరిరక్షించడం.

ఇక్కడ ఒక విస్తృత సామాజిక నేపథ్యాన్ని పరిశీలించడం అవసరం. భారతదేశంలో శారీరక శిక్ష (corporal punishment) పై చట్టపరమైన దృక్కోణం గత కొన్ని దశాబ్దాల్లో గణనీయంగా మారింది. ఒకప్పుడు "బెత్తం బుద్ధి చెబుతుంది" అనే భావన సాధారణంగా అంగీకరించబడేది. కానీ పిల్లల హక్కులపై అవగాహన పెరగడంతో ఈ దృక్కోణం మారింది. 2009లో అమలులోకి వచ్చిన విద్యా హక్కు చట్టం (Right to Education Act) ప్రకారం పాఠశాలల్లో శారీరక శిక్షను నిషేధించారు. అలాగే జువైనల్ జస్టిస్ చట్టం కూడా పిల్లలపై హింసను కఠినంగా శిక్షిస్తుంది.

నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (NCPCR) నివేదికల ప్రకారం భారతదేశంలో ఇంకా అనేక పాఠశాలల్లో శారీరక శిక్ష కొనసాగుతున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో చదివే విద్యార్థుల్లో సుమారు 60 శాతం వరకు ఎప్పుడో ఒకసారి శారీరక శిక్షను అనుభవించినట్లు వెల్లడైంది. ఇది చట్టం ఉన్నప్పటికీ అమలులో లోపాలు ఉన్నాయని చూపిస్తుంది.

ఈ నేపథ్యంలో కేరళ హైకోర్టు తీర్పు ఒక కీలక ప్రశ్నను లేవనెత్తుతోంది—శారీరక శిక్షను పూర్తిగా నిషేధించిన చట్టాల నేపథ్యంలో "పరిమిత శారీరక చర్య"కు స్థానం ఉందా? కోర్టు ఇచ్చిన తీర్పు పూర్తిగా శారీరక శిక్షకు మద్దతు ఇవ్వలేదు. కానీ ప్రతి సందర్భాన్ని దాని ప్రత్యేక పరిస్థితుల ఆధారంగా పరిశీలించాలని సూచించింది. ఇది ఒక రకంగా 'సందర్భానుసార న్యాయం' (contextual justice) భావనకు దగ్గరగా ఉంటుంది.

ఈ నేపథ్యంలో ఒక సమగ్ర దృక్కోణం అవసరం. విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించడం అనివార్యం. కానీ దానికి ఉపయోగించే పద్ధతులు సమకాలీన విలువలకు అనుగుణంగా ఉండాలి. సైకాలజీ పరిశోధనలు చూపిస్తున్నట్లుగా, శారీరక శిక్ష తాత్కాలికంగా ప్రవర్తనను నియంత్రించగలిగినా దీర్ఘకాలంలో భయం, ఆత్మవిశ్వాస హీనత, ఆగ్రహం వంటి ప్రతికూల ప్రభావాలు కలిగిస్తుంది. అందువల్ల సానుకూల క్రమశిక్షణ (positive discipline), ప్రవర్తనా మార్పు పద్ధతులు, కౌన్సెలింగ్ వంటి మార్గాలు ఎక్కువగా ప్రోత్సహించ బడుతున్నాయి.

అంతిమంగా విద్య అంటే కేవలం నియంత్రణ కాదు, మార్గనిర్దేశం. శిక్ష అంటే భయం కాదు, అవగాహన. ఈ విలువలను ప్రతిబింబించే విధంగా విద్యా వ్యవస్థ రూపుదిద్దుకున్నప్పుడే సమాజం నిజమైన అర్థంలో అభివృద్ధి చెందుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# తమిళ భవిష్యత్ కోసం ఎన్‌డిఎకు ఓటేయండి

పూర్వవైభవం రావాలంటే మార్పు రావాలి
మోడీ నేత్రుతత్వంలో దేశానికి సమర్థ నాయకత్వం
ఎన్‌డిఎ నేతలతో చంద్రబాబు మీడియా సమావేశం


**చెన్నై, నినాదం:**

తమిళ ప్రజల భవిష్యత్తు కోసం తానే స్వయంగా చెన్నైకి వచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ ముందు చూపుతో ఆలోచిస్తారని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు ఓటు వేయాలని ఆయన కోరారు. తమిళనాడుకు పూర్వ వైభవం రావాలంటే ఎన్డీయే కూటమిని గెలిపించాలి. దేశానికి నరేంద్ర మోదీ వంటి సమర్థ నాయకత్వం ఉంది. సరైన సమయంలో మంచి ఆలోచన చేయాలని తమిళనాడు ప్రజలను కోరుతున్నా. సమర్థులను ఎన్నుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు దేశంలో చెన్నై కీలక స్థానంలో ఉందని.. ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. నగర అభివృద్ధి గణనీయంగా మందగించిందని.. చెన్నై ఎయిర్‌పోర్టు పరిస్థితి సంతృప్తికరంగా లేదన్నారు. బెంగళూరు, హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందాయని.. ఐటీ, మౌలిక వసతులు, పెట్టుబడుల విషయంలో ముందున్నాయని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తమిళనాడులో సీఎం చంద్రబాబు పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. ఎన్డీఏకి మద్దతు కోరుతూ చెన్నైలో చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తమిళనాడు ఎన్‌డిఎ నేతలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..'తమిళనాడుకు గొప్ప చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉంది. ఒకప్పుడు చెన్నై ప్రధాన కేంద్రంగా సినీ పరిశ్రమ, ఉద్యోగ అవకాశాలు విస్తారంగా ఉండేవి. నా వివాహం కూడా ఇక్కడే జరిగింది. ఈ నగరంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఏపీజే అబ్దుల్ కలాం, ఎంఎస్ స్వామినాథన్, అన్నాదురై వంటి మహానుభావులు తమిళనాడులో జన్మించారు. దేశానికి గొప్ప మేధావులను ఈ రాష్ట్రం అందించింది. కానీ, ప్రస్తుతం చెన్నైలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి దెబ్బతింది. మహిళలపై నేరాలు సుమారు 59 శాతం మేర పెరిగాయి. కస్టోడియల్ డెత్ కేసులూ పెరిగాయి. నకిలీ మద్యం ఘటనలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. చెన్నై ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పెద్దగా మార్పు కనిపించడం లేదు. 1995 నుంచి చాలా రోడ్లు అలానే ఉన్నాయి. వర్షాలు పడితే నగరంలో రోడ్లు మునిగిపోతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. ?తమిళనాడుకు కేంద్రం నుంచి సమృద్ధిగా నిధులు వచ్చాయి. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు ఎంజీ రామచంద్రన్ పేరు పెట్టింది కేంద్ర ప్రభుత్వమే. ?హైస్పీడ్ రైలు ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రాభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారుతాయి. ప్రకాశవంతమైన భవిష్యత్, మంచి ఉద్యోగ అవకాశాలు కావాలంటే ప్రజలు ఈసారి జాగ్రత్తగా, తెలివిగా ఓటు వేయాలి. డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతంగా కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర సమన్వయం ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. కేవలం రాజకీయ కారణాలతో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వెళ్లకూడదు. రాజకీయ లాభాల కోసం రాష్ట్రానికి నష్టం చేయడం సరైంది కాదు. అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది. ప్రధాని మోదీకి సహకరించి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలి. పార్లమెంట్‌లో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులను కాంగ్రెస్, డీఎంకే పార్టీలు అడ్డుకున్నాయి. మహిళలకు రావాల్సిన ప్రాతినిధ్యాన్ని అడ్డుకుని ద్రోహం చేశాయి. దక్షిణాది రాష్ట్రాలకు లెక్కల ప్రకారం సీట్లు తగ్గుతాయని ప్రచారం జరుగుతోంది. కానీ వాస్తవానికి సీట్లు పెరుగుతాయి. బిల్లులో స్పష్టంగా సీట్ల పెంపు గురించి పేర్కొన్నారు. తమిళనాడులో ప్రస్తుతం 39 సీట్లు ఉండగా.. 59కి పెరిగే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోనూ పార్లమెంట్ సీట్లు పెరుగుతాయి. డీలిమిటేషన్ పక్రియలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు. సమతుల్యమైన ఫార్ములాతోనే సీట్ల పునర్విభజన జరుగుతుంది. కానీ ప్రస్తుత జనగణన ఆధారంగా చూస్తే దక్షిణాది రాష్ట్రాలు వెనుకపడే ప్రమాదం ఉంది. ఆర్థిక సంస్కరణల వల్లే దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయి. పర్ క్యాపిటా ఆదాయం గణనీయంగా పెరిగింది. నేను కూడా ద్రవిడ వ్యక్తినే. దక్షిణాది అభివృద్ధి పట్ల నాకు ప్రత్యేక దృష్టి ఉంది. ??ముందు చూపు ఉన్న నాయకుడు ప్రధాని నరేంద్ర మోదీ. దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే విజనరీ లీడర్ మోదీ. ఈసారి ఎన్నికల్లో ఎన్డీయేకే మద్దతు తెలుపుదాం' అని చెప్పుకొచ్చారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలో బలమైన ప్రభుత్వం అధికారంలో ఉంది. కేంద్రం ఉదారంగా నిధులు ఇస్తున్నప్పుడు వినియోగించుకోవాలి కదా. సంక్షేమ కార్యక్రమాల కోసం చెన్నైకి కేంద్రం రూ.14 లక్షల కోట్లు ఇచ్చింది. కేంద్ర నిధులను దారి మళ్లించడం సమంజసమా అని చంద్రబాబు ప్రశ్నించారు.



# విటమిన్ డి స్థాయిలను పెంచుకోండిలా

**ఆధునిక జీవనశైలిలో ఒత్తిడి, పరుగుల మధ్య అలసట, శరీర నొప్పులు, మూడ్ మార్పులు వంటి సమస్యలు చాలామందికి సాధారణంగా కనిపిస్తున్నాయి. వీటిని చాలాసార్లు నిద్రలేమి, ఒత్తిడి లేదా సీజనల్ మార్పుల ప్రభావంగా భావించి పట్టించుకోరు. కానీ ఈ లక్షణాల వెనుక విటమిన్ డి లోపం వంటి లోతైన సమస్య దాగి ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.**




విటమిన్ D స్థాయిలను పెంచడానికి కొన్ని సాధారణ చిట్కాలు పాటించాలి. ముఖ్యంగా సూర్యకాంతి ద్వారా శరీరం సహజంగా విటమిన్ D తయారు చేస్తుంది. కాబట్టి వారానికి కొన్ని రోజులు ఉదయం 10 నుండి 30 నిమిషాల పాటు సూర్యరశ్మిలో ఉండటం మంచిది. ఆహారంలో కూడా విటమిన్ D ఉన్న పదార్థాలను చేర్చాలి. సాల్మన్, మాకరెల్, సార్డిన్స్ వంటి ఫ్యాటీ ఫిష్, ఫోర్టిఫైడ్ డెయిరీ ఉత్పత్తులు, గుడ్డు పచ్చసొన, UV లైట్‌కు ఎక్స్‌పోజ్ చేసిన మష్రూమ్స్ వంటి వాటిని తీసుకోవాలి. ఇక సూర్యకాంతి లేదా ఆహారం ద్వారా సరిపడా విటమిన్ D లభించకపోతే సప్లిమెంట్స్ తీసుకోవచ్చు. అయితే వాటిని తీసుకునే ముందు వైద్యుల సలహా తప్పనిసరి. అదనంగా, రెగ్యులర్ బ్లడ్ టెస్టులు చేయించుకోవడం ద్వారా విటమిన్ D స్థాయిలను పరిశీలించుకోవచ్చు. అలసట, శరీర నొప్పులు, మూడ్ మార్పులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు. ఇవి విటమిన్ డి లోపానికి సంకేతాలు కావచ్చు. ఈ లక్షణాలను గుర్తించి సమయానికి చర్యలు తీసుకుంటే, ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడంతో పాటు జీవన ప్రమాణాన్ని కూడా పెంచుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

**బలహీనంగా మారే ఎముకలు..**

ఎముకలు, లోయర్ బ్యాక్ నొప్పులు కూడా దీని లోపంతో సంభవిస్తాయి. కాల్షియం శోషణలో విటమిన్ D కీలకంగా ఉండటంతో, ఇది తగ్గిపోతే ఎముకలు బలహీనపడి నొప్పులు పెరుగుతాయి. ముఖ్యంగా కాళ్లు, పక్కటెముకలు, వెన్ను భాగంలో నొప్పి కనిపించవచ్చు. గాయాలు ఆలస్యంగా మానడం కూడా ఒక సంకేతం. చిన్న గాయాలు కూడా ఎక్కువ సమయం తీసుకుంటే, శరీరంలో విటమిన్ D స్థాయిలు తక్కువగా ఉండే అవకాశం ఉంది. ఎందుకంటే ఇది చర్మ పునరుద్ధరణ, ఇన్‌ఫ్లమేషన్ (వాపు)ను తగ్గించడంలో సహాయపడుతుంది. తరచూ జబ్బుల బారిన పడటం కూడా దీని లోపానికి సంకేతం. విటమిన్ D రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. ఇది తక్కువగా ఉంటే ఇన్‌ఫెక్షన్లు, జబ్బులు సులభంగా వస్తాయి. అలాగే తీవ్రమైన లోపం ఉన్నప్పుడు జుట్టు ఊడిపోవడం కూడా కనిపించవచ్చు. కండరాల బలహీనత కూడా దీని లోపంతో వస్తుంది. సాధారణంగా చేసే పనులు చేయడంలో కష్టంగా అనిపించడం, శక్తి తగ్గడం వంటి సమస్యలు ఎదురవుతాయి.






# పీసీఓఎస్ ఉన్నా.. బరువు తగ్గొచ్చు ఇలా..!

పాలీసిస్టిక్ ఓవరీ సింట్రోమ్ (PCOS) ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది మహిళలను ప్రభావితం చేస్తోంది. దీనికారణంగా మహిళలు అధిక బరువు సమస్యను ఎదుర్కొంటుంటారు. సంతానోత్పత్తి వయసు ఉన్న ప్రతి ఐదుగురి అమ్మాయిల్లోఓ ఒకరు ఈ సమస్య బారినపడతారని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. దీనికి ప్రధాన కారణం జీవనశైలి మార్పులు, ఒత్తిడి, ఆహారపు అలవాట్లు అని చెబుతున్నారు నిపుణులు. ఈ సమస్యను చక్కటి జీవనశైలి, చక్కటి ఆహారపు అలవాట్లతో చక్కదిద్దొచ్చని చెబుతున్నారు నిపుణులు. అదెలాగో వైద్యుల మాటల్లోనే సవివరంగా తెలుసుకుందామా..!. పీసీఓఎస్ సమస్యతో బాధపడుతున్నమహిళలు తీసుకోవాల్సిన ఆహారాలు గురించి వెల్లడించారు. అవేంటంటే..వాటిలో గుడ్లు మంచి ఆహారమని చెబుతున్నారు. ఎందుకంటే ఇది ప్రోటీన్లతో నిండి ఉంటుంది. మిమ్మల్ని ఎక్కువసేపు కడుపునిండుగా ఉంచడంలో సహాయపడుతుందని చెబుతున్నారు వైద్యులు. అవకాడోలు హార్మోన్ల నియంత్రణకు సహాయపడే ఆరోగ్యకరమైన కొవ్వులను అందిస్తాయట. అలాగే బెర్రీలు రక్తంలో చక్కెర స్థాయిలను పెంచకుండా, తీపి తినాలనే కోరికను నివారించేలా తక్కువ చక్కెర, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయని చెబుతున్నారు. చియా గింజలు మెరుగైన జీర్ణక్రియకు, మంచి ఫైబర్‌కు ఉపయోగపడతాయని అన్నారు. అలాగే పెరుగు పేగు ఆరోగ్యాన్ని ప్రోత్సహించడమే గాక జీవక్రియకు మద్దతిస్తుందని అన్నారు. దీంతోపాటు ఈ సమస్యను తీవ్రతరం చేసే ఆహారాలకు దూరంగా ఉండేలా కేర్ తీసుకోవాలని సూచించారు.

## 5 నిమిషాల వ్యాయామంతో అద్భుత ఫలితాలు



వారంలో ఐదు రోజులపాటు క్రమంగా వ్యాయామం చేయాలని ఉత్సాహంగా ప్రారంభించి, కొద్ది రోజుల్లోనే ఆ ఉత్సాహం తగ్గిపోవడం చాలా మందికి ఎదురయ్యే సాధారణ సమస్య. దీంతో స్థిరమైన వ్యాయామ అలవాటు కొనసాగించడం కష్టమవుతుంది. అయితే వ్యాయామం విషయంలో ఏదైనా చేయడం, ఏమీ చేయకపోవడం కంటే మంచిదే అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని నిపుణులు చెబుతున్నారు. పలు అధ్యయనాల ప్రకారం రోజుకు కేవలం ఐదు నిమిషాల వ్యాయామం చేసినా కూడా గణనీయమైన ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. తాజాగా జర్నల్ ఆఫ్ ది అమెరికన్ కాలేజ్ ఆఫ్ స్పోర్ట్స్ మెడిసిన్లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, వారానికి రెండు సార్లు ప్రధాన కండర సమూహాలపై వ్యాయామం చేస్తే శక్తి, కండరాల పరిమాణం, మొత్తం శారీరక పనితీరులో స్పష్టమైన మెరుగుదల కనిపిస్తుందని వెల్లడైంది.

# అజీర్తితో సమస్యలకు బొప్పాయితో చెక్!

అన్ని ఆరోగ్య సమస్యలకు డాక్టర్ల వద్దకే పరుగెత్తాల్సిన అవసరం లేదు. అలాంటి వాటిని దూరం చేసే సహజమైన ఆహారాలో, చిట్కాలో కూడా ఉంటాయి. వాటిని పాలో అయితే చాలు అంటారు పెద్దలు. చాలా సమస్యలను మనం తీసుకునే ఆహారాల ద్వారా నివారించే అవకాశం ఉంటుందని నిపుణులు కూడా చెబుతుంటారు. అలాంటి వాటిలో బొప్పాయి పండు కూడా ఒకటి. ఇది అజీర్తిని దూరం చేస్తుంది. ఆరోగ్యానికి మేలు చేస్తుంది.



పోషకాహార నిపుణుల ప్రకారం.. బొప్పాయి ఒక సాధారణ పండు మాత్రమే కాదు. మన డైజెస్టివ్ హెల్త్‌ను మెరుగు పరిచే ఔషధం లాంటిది కూడా. ఎందుకంటే ఇందులో సహజంగానే పాపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది ప్రోటీన్లను సులభంగా విచ్ఛిన్నం చేసి, ఆహారం జీర్ణం కావడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా భోజనం తర్వాత కడుపు ఉబ్బరం, గ్యాస్, అసౌకర్యం వంటి సమస్యలను తగ్గించి, శరీరాన్ని తేలికగా ఉంచుతుంది.

**బొప్పాయి ఎందుకు బెస్ట్?**

బొప్పాయిలోని సహజ ఎంజైములు ఆహారాన్ని వేగంగా జీర్ణం చేయడంలో సహాయపడతాయి. తింటే కడుపులో తేలికగా ఉన్న భావన ఏర్పడుతుంది. మలబద్ధకం తగ్గుతుంది. విటమిన్ సి, ఫైబర్ సమృద్ధిగా ఉండటంవల్ల రోగ నిరోధక శక్తిని కూడా బలోపేతం చేస్తుంది. ఉదయం ఖాళీ కడుపున లేదా భోజనం తర్వాత కొన్ని తాజా బొప్పాయి ముక్కలు తినడం మంచిదంటారు పోషకాహార నిపుణులు. ఇతర ఆహారాలతో కలిపి కూడా తినవచ్చు. కానీ అలా చేయకుండా నేరుగా తినడంవల్ల మరింత మంచి ఫలితం కనిపిస్తుందని చెబుతున్నారు. అయితే పచ్చిగా ఉన్నప్పుడు కాకుండా పండిన బొప్పాయిని తినడం బెటర్. తరచుగా బొప్పాయి తినే వారిలో జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. అయితే అలర్జీలు, ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉన్నవారు మాత్రం డాక్టర్ సలహా తీసుకొని తినాలని నిపుణులు సూచిస్తున్నారు.




## లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు



అంతర్జాతీయంగా ఉన్న సానుకూల సంకేతాలవల్ల భారత స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగిశాయి. అమెరికా, ఇరాన్ మధ్య జరగనున్న చర్చల్లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించవచ్చనే ఆశలతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడింది. ఫలితంగా మంగళవారం ట్రేడింగ్‌లో సూచీలు భారీ లాభాలను నమోదు చేశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 753.03 పాయింట్లు లాభపడి 79,273.33 వద్ద స్థిరపడింది.
అదేవిధంగా ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 211.75 పాయింట్లు లాభపడి 24,576.60 వద్ద ముగిసింది. నెస్లే ఇండియా, ట్రెంట్, హిందుస్థాన్ యూనిలీవర్ వంటి హెవీవెయిట్ షేర్లలో కొనుగోళ్లు సూచీల పెరుగుదలకు దోహదపడ్డాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ సానుకూల వాతావరణం కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.49 శాతం, స్మాల్‌క్యాప్ 0.88 శాతం మేర లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, రియల్టీ సూచీలు మంచి పనితీరు కనబరచగా నిఫ్టీ ఫార్మా వెనుకబడింది. సాంకేతికంగా నిఫ్టీకి 24,600 స్థాయి వద్ద తక్షణ నిరోధం ఎదురవుతోందని, దానిని దాటితే 24,850, ఆపై 25,000 స్థాయిలకు చేరవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. కింది స్థాయిలో 24,350–24,400 శ్రేణి తక్షణ మద్దతుగా పనిచేస్తుందని తెలిపారు.

# సవాళ్లు ఉన్నప్పటికీ స్థిరమైన వృద్ధి

## 2026లో భారత వృద్ధి రేటు 6.6 శాతం: యూఎన్ నివేదిక

అంతర్జాతీయంగా భౌగోళిక రాజకీయ సవాళ్లు ఉన్నప్పటికీ భారత ఆర్థికవ్యవస్థ మెరుగైన వృద్ధిని కొనసాగిస్తుందని ఐక్యరాజ్యసమితి(యూఎన్) అభిప్రాయపడింది. రాబోయే సంవత్సరాల్లో కూడా స్థిరమైన వృద్ధిని కొనసాగిస్తుందని యూఎన్ అనుబంధ సంస్థ ఆసియా-పసిఫిక్ ఆర్థిక, సామాజిక కమిషన్ (ఈఎస్‌సీఏపీ) అంచనా వేసింది. ఫలితంగా 2026లో భారత్ ఆర్థిక వృద్ధి రేటు 6.4 శాతంగా, 2027లో 6.6 శాతంగా నమోదవుతుందని పేర్కొంది. ద్రవ్యోల్బణం కూడా ఈ ఏడాది 4.4 శాతం, 2027లో 4.3 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. నివేదిక ప్రకారం, గ్రామీణ వినియోగం పెరగడం, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేట్ల తగ్గింపు, అమెరికా సుంకాల అమలుకు ముందే ఎగుమతులను వేగవంతం చేయడం వంటి అంశాల కారణంగా 2025లో భారతదేశ వృద్ధి రేటు 7.4 శాతానికి చేరింది. దీంతో నైరుతి, దక్షిణాసియా ప్రాంతం మొత్తం వృద్ధి కూడా పెరిగింది. ముఖ్యంగా గ్రీన్‌ఫీల్డ్ ఎఫ్‌డీఐ పెట్టుబడులను ఆకర్షించడంలో భారత్ ముందంజలో నిలిచింది. 2024లో భారత్ సుమారు 50 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించగా, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, కజకిస్తాన్ తదుపరి స్థానాల్లో నిలిచాయి. మొత్తంగా.. గ్లోబల్ సవాళ్లు, వాణిజ్య ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, బలమైన వినియోగం, సేవల రంగం, ప్రభుత్వ విధానాల మద్దతుతో భారత ఆర్థికవ్యవస్థ స్థిరమైన వృద్ధి మార్గంలో కొనసాగుతుందని నివేదిక స్పష్టం చేసింది.

# యాపిల్ కొత్త సీఈవోగా జాన్ టర్నెస్

టెక్ దిగ్గజం యాపిల్ తన నాయకత్వంలో భారీ మార్పులను ప్రకటించింది. ఎన్విడియాతో పోటీకి అనుగుణంగా కొత్త నాయకుడిని ఎంపిక చేసింది. 15 ఏళ్లుగా కంపెనీకి సీఈవోగా సేవలు అందించిన టిమ్ కుక్ ఆ పదవి నుంచి వైదొలగనున్నారు. హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న జాన్ టర్నెస్‌కు కొత్త సీఈవోగా పగ్గాలు అప్పగించింది. సెప్టెంబర్ 1వ తేదీన ఆయన దీనిని స్వీకరించనున్నారు. ఇక ఇప్పటివరకు సీఈవో స్థానంలో ఉన్న టిమ్ కంపెనీ ఎగ్జిక్యూటీవ్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. సీఈవోగా కుక్ 2011లో బాధ్యతలు చేపట్టాక కంపెనీ షేరు విలువ 20 రెట్లు పెరిగి ఆర్థిక మహాశక్తిగా ఉదయించింది. ఇక జానీ స్రౌజీని కంపెనీ చీఫ్ హార్డ్‌వేర్ ఆఫీసర్‌గా నియమించింది. ఇక గతంలో జాన్ టర్నెస్ నాయకత్వం వహించిన హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ విభాగానికి సీనియర్ టామ్ మెరీబ్‌కు అప్పగించారు.



**ఎన్విడియాతో పోటీకి సై..**

ఈ నాయకత్వ మార్పుతో యాపిల్ ఆపరేషనల్-సప్లైచైన్ నైపుణ్యాల నుంచి హార్డ్‌వేర్, ఏఐ వైపు దృష్టి మరల్చినట్లైంది. ముఖ్యంగా చిప్ దిగ్గజం ఎన్విడియాతో టెక్నాలజీ, ఏఐ విభాగంలో పోరుకు సిద్ధమవుతోంది. ఇటీవలే ఎన్విడియా యాపిల్ మార్కెట్ విలువను దాటేసింది. 2001లో యాపిల్‌లో చేరిన టర్నెస్‌కు ఇప్పుడు వయసు 50 ఏళ్లు. ఆయన సుదీర్ఘకాలం కంపెనీని నడిపించవచ్చన్న అంచనాలున్నాయి. కంపెనీ కీలక ప్రాజెక్టులైన మ్యాక్, ఐపాడ్స్, ఎయిర్‌పాడ్స్ డిజైనింగ్, డెవలప్‌మెంట్‌లో కీలక పాత్ర పోషించారు. మ్యాక్ విక్రయాలను పుంజుకొనేలా చేసేందుకు 'ప్రో'ను తీసుకొచ్చారు.

**ఎవరీ జాన్ టర్నెస్..**

ఉద్యోగాలు మారుతూ వేగంగా కెరీర్‌లో మెట్లు పైకెక్కాలని ఎవరికైనా ఉంటుంది. దానికితగ్గట్లే లింక్డిన్ ప్రొఫైల్‌ను అన్ని హంగులతో తీర్చిదిద్దుకొంటారు. కానీ, ఓ వ్యక్తి తాను చేరిన తొలి ఉద్యోగంలోనే 25 ఏళ్లు కొనసాగి.. మరో కంపెనీ మారే ఉద్దేశమే లేదన్నట్లు లింక్డిన్ ప్రొఫైల్‌నే బ్లాంక్‌గా వదిలేశాడు. కానీ, కెరీర్‌లో శరవేగంగా ఎదిగి.. ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత విలువైన రెండో కంపెనీకి సీఈవోగా ఎంపికయ్యాడు. అతడి పేరు జాన్ టర్నెస్..! ప్రపంచవ్యాప్తంగా జాన్ వివరాలు తెలుసుకొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. 15 ఏళ్లు యాపిల్‌కు సేవలు అందించిన టిమ్ ఇప్పుడు సీఈవో స్థానం వీడి.. ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. దీంతో హార్డ్‌వేర్ విభాగం నుంచి వచ్చిన జాన్‌ను సీఈవో పదవి వరించింది. ప్రస్తుతం ఆయన కంపెనీలో హార్డ్‌వేర్ విభాగంలో వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. 2001లో యాపిల్‌లో చేరారు. యాపిల్ మ్యాక్, ఐపాడ్స్, ఎయిర్ పాడ్స్ తయారీలో జాన్ సైంటిఫిక్ బ్రెయిన్ ఉంది. తాను కంపెనీలో చేరి 25 ఏళ్లు పూర్తికానున్నట్లు జాన్ లింక్డిన్ ప్రొఫైల్ చెబుతోంది. అంతకుమించి దానిలో ఏ పోస్టు లేదు. కనీసం ప్రొఫైల్ పిక్చర్ కూడా పెట్టలేదు. యాపిల్‌కు 80% ఆదాయం తీసుకొచ్చే పరికరాలు మొత్తం టర్నెస్ పర్యవేక్షణలోనే తయారవుతాయి. మ్యాక్‌లలో యాపిల్ తన చిప్‌లను అనుసంధానం చేయడంలో టర్నెస్ కీలక పాత్ర పోషించారని చెబుతారు. ఆ తర్వాత మ్యాక్‌ల విక్రయాలు మళ్లీ పుంజుకొన్నాయి.



# ఐదేళ్ల కనిష్టానికి ఎరువుల ఉత్పత్తి

## భారత ఎరువుల రంగంలో భారీ సంక్షోభం: మార్చిలో 24.6 శాతం తగ్గిన ఉత్పత్తి

పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు భారత ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా ఎరువుల రంగంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. చైన్ సప్లయ్ సిస్టమ్‌లో తలెత్తిన అంతరాయాల కారణంగా ఈ ఏడాది మార్చి నెలలో ఎరువుల ఉత్పత్తి గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 24.6 శాతమేర పడిపోయింది. గత ఐదేళ్ల కాలంలో ఎరువుల ఉత్పత్తి ఈ స్థాయిలో తగ్గడం ఇదే మొదటిసారి అని నిపుణులు తెలిపారు. ఉత్పత్తి కుంటుపడటంతో రైతాంగంలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఎరువుల రంగంలో వచ్చిన భారీ క్షీణత దేశంలోని ఎనిమిది కీలక రంగాల సూచీపై ప్రభావం చూపింది. దీనివల్ల మొత్తం ఇండెక్స్ 0.4 శాతం మేర తగ్గింది. దేశీయంగా ఎరువుల కొరత తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎరువుల తయారీ కర్మాగారాలకు సహజ వాయువు సరఫరాను ప్రభుత్వం పెంచింది. సాధారణంగా భారత్ తన మొత్తం ఎరువుల అవసరాల్లో దాదాపు 25 శాతం దిగుమతులపైనే ఆధారపడుతుంది. ఎరువుల రంగం ఒడిదుడుకులకు లోనైనప్పటికీ, ఉక్కు ఉత్పత్తి 2.2 శాతం, సిమెంట్ ఉత్పత్తి 4 శాతం మేర స్వల్ప వృద్ధిని నమోదు చేశాయి. అయితే, గతంతో పోలిస్తే ఈ రంగాల వృద్ధి వేగం కూడా మందగించింది. పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం సద్దుమణిగితేనే సరఫరా వ్యవస్థ మళ్లీ గాడిన పడే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఫెడెక్స్ డ్రోన్ డెలివరీ ప్రయోగాలు విజయవంతం




## భారత్‌లో తొలిసారి..

భారతదేశంలో మొట్టమొదటి ఇంట్రా-సిటీ (నగర పరిధిలో) డ్రోన్ డెలివరీ ప్రయోగాత్మక పరీక్షలను బెంగళూరు నగరంలో విజయవంతంగా పూర్తి చేసినట్లు దిగ్గజ డెలివరీ సంస్థ 'ఫెడెక్స్' మంగళవారం ప్రకటించింది. ఐఐటీ-మద్రాస్ భాగస్వామ్యంతో ఈ డెలివరీ ఫ్లైట్ ట్రయల్స్ నిర్వహించినట్లు వెల్లడించింది.

**సగానికి పైగా తగ్గిన డెలివరీ సమయం..**

ఐఐటీ-మద్రాస్‌లోని 'ఫెడెక్స్ స్మార్ట్ సెంటర్' పరిశోధనల ఆధ్వర్యంలో ఈ పరీక్షలు జరిగాయి. సాధారణంగా రోడ్డు మార్గంలో 53 కిలోమీటర్ల దూరం ప్రయాణించి పార్శిల్‌ను డెలివరీ చేయడానికి గంటకు పైగా (60 నిమిషాలు) సమయం పడుతుంది. కానీ, గగనతలంలో 39-42 కిలోమీటర్ల ఏరియల్ రూట్ (వాయు మార్గం) ద్వారా కేవలం 21 నిమిషాల్లోనే డ్రోన్ గమ్యస్థానాన్ని చేరుకున్నట్లు ఫెడెక్స్ స్పష్టం చేసింది. అత్యవసర సమయాల్లో సరుకు రవాణా (లాజిస్టిక్స్) రంగంలో ఇది ఒక గొప్ప ముందడుగు అని సంస్థ పేర్కొంది.

**డీజీసీఏ ముందస్తు అనుమతులతో..**

విమానాశ్రయానికి సమీపంలోని ఎల్లో, రెడ్ జోన్ల మీదుగా ఈ డ్రోన్ ప్రయాణించింది. ఇందుకు సంబంధించి డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ నుంచి ముందస్తుగా అన్ని అధికారిక అనుమతులు తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. విద్యా సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ విధాన రూపకర్తల భాగస్వామ్యంతో.. భవిష్యత్తు అవసరాలకు తగ్గట్లుగా ఎయిర్ కార్గో ఆప్టిమైజేషన్, స్థిరమైన సప్లై చైన్ (సరఫరా) వ్యవస్థను రూపొందించడమే తమ లక్ష్యమని ఫెడెక్స్ మార్కెటింగ్ విభాగం ఉపాధ్యక్షుడు నితిన్ నవనీత్ తటివాల ఈ సందర్భంగా తెలియజేశారు.

## తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అశోక్



**సంగారెడ్డి, ఏప్రిల్ 21(నినాదం):** తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా నియమిస్తు టి జె ఏ చైర్మన్ నియామక పత్రాన్ని అందజేసారు. అనంతరం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి అశోక్ మాట్లాడుతూ నాపై నమ్మకం తో నాను నియమిచ్చిన చైర్మన్ ఉప్పల లక్ష్మణ్ గారికి, రాష్ట్ర అధ్యక్షులు వెంకటరమణ రావు గారికి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎం ఆర్ గోరి గారికి,రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బి శ్రీనివాస్ గారికి మరియు రాష్ట్ర కోశాధికారి ఖీలీల్ సబ్ గారికి, జిల్లా అధ్యక్షులు సిద్ధిక్ సబ్ గారికి హృదయ పూర్వక ధన్యవాదములు, జిల్లా లో టి జె ఏ ను బలోపేతం చేస్తానని ఈసందర్భంగా తెలియ జేస్తున్నాను.

## బౌరంపేట్ స్నేక్ పార్క్‌లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి

### ఫారెస్ట్ అధికారికి నేతల వినతి



**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 21 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బౌరంపేట్‌లోని స్నేక్ పార్క్‌లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ, శంభీపూర్ రాజు , బీఆర్ఎస్ పార్టీ విప్ ఎమ్మెల్యే కేపీ వివేకానందను బౌరంపేట్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కోరారు. వెంటనే ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే స్పందించి మేడ్చల్ జిల్లా ఫారెస్ట్ అధికారికి పార్క్ లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు సహకరించాలని కోరుతూ ఎమ్మెల్సీ చంబిపూర్ రాజు చరవాణి ద్వారా సంబంధిత అధికారికి వివరించారు. వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు కోరుతున్న ఎమ్మెల్యే సిఫాసు లేఖను మేడ్చల్ జిల్లా ఫారెస్ట్ అధికారి ని బౌరంపేట ఫాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్ వి సురేందర్ రెడ్డి, సర్దారీ ధర్మారెడ్డి, పల్పనూరు విష్ణువర్ధన్ రెడ్డి లు మర్యాదపూర్వకంగా కలిసి స్నేక్ పార్క్ లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ ఆఫీసర్ సానుకూలంగా స్పందిస్తూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు అధికారులతో చర్చించి ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు ఫాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి పత్రికా ప్రకటనలో వివరించారు.

## పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు



**సిద్దిపేట, ఏప్రిల్ 21(నినాదం):** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని జనసేన నాయకులు ఆకాంక్షించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం జనసేన నాయకులు మురార్ కార్ సాయికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి కుమార్ మాట్లాడుతూ... ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జరిగిన శస్త్ర చికిత్స అనంతరం త్వరగా కోలుకొని ఆయురారోగ్యాలతో మళ్ళీ ప్రజాసేవలోకి రావాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జన సేన నాయకులు చుంచు నాగరాజు, అక్కు మల్లేశం, బండి పల్లి కృష్ణ గౌడ్, మంకాల శ్రీకాంత్, బట్టు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి సహకరించండి

### ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకుంటే ప్రజా ఉద్యమం తప్పదు

### బీహెచ్‌ఈఎల్ యాజమాన్యానికి విన్నవించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**రామచంద్రాపురం, ఏప్రిల్ 21 (నినాదం):** రామచంద్రపురం డివిజన్ పరిధిలో గల బిహెచ్ఇఎల్ భూములకు సంబంధించి నెలకొన్న వివాదాలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని.. కాలయాపన చేస్తే ప్రజల నుండి వ్యతిరేకత ఎదురుకోవాల్సి వస్తుందని బిహెచ్ఈఎల్ యాజమాన్యానికి పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. మంగళవారం ఉదయం బిహెచ్ఇయల్ ఈడి శ్రీనివాస్, ఏజిఎం సురన్ ప్రసాద్ లతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా ఈఎస్ఐ చర్చి సమీపంలో గల బీరప్ప గుడిని బిహెచ్ఇయల్ పరిశ్రమ భూమిలో ఉందంటూ సంబంధిత అధికారులు తొలగించడం జరిగిందని తెలిపారు. ఇది మాత్రం సమంజసం కాదని.. పరిశ్రమ ఏర్పాటు చేయకముందు నుండి గుడి అక్కడే ఉందని తెలిపారు. వెంటనే అదే స్థలంలో గుడిని పునర్నిర్మాణం చేపట్టకపోతే ప్రజల నుండి తీవ్ర నిరసన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజల భావోద్వేగాలకు సంబంధించిన అంశాలలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రామచంద్రపురం రాయసముద్రం చెరువు సుందరీకరణ అంశంలో ఎందుకు అడ్డుపడుతున్నారంటూ ప్రశ్నించారు. ప్రజోపయోగ అంశాలలో సహకరించాల్సింది పోయి అడ్డుకోవడం సమంజసం కాదని తెలిపారు. చెరువు సుందరీకరణ పనులకు ఎట్టి పరిస్థితుల్లో అడ్డంకులు తెలపవద్దని విజ్ఞప్తి చేశారు. ఈఎస్ఐ సమీపంలో గల క్రిస్టియన్ కమ్యూనిటీ స్మశాన వాటికలో కేవలం బీహెచ్ఈఎల్ ఉద్యోగులకు..వారి కుటుంబ సభ్యులకు మాత్రమే అంత్యక్రియలకు అనుమతిస్తున్నారని స్థానికులు తన దృష్టికి తీసుకొని రావడం జరిగిందని తెలిపారు. స్థానికులకు సైతం అనుమతించాలని కోరారు. అదే విధంగా హిందూ స్మశాన వాటికలో మౌలిక వసతుల కల్పనకు అభ్యంతరాలు తెలుపవద్దని కోరారు. ఈ అంశాలపై బుధవారం సాయంత్రం మరో మారు క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్లు పుష్ప నగేష్, అంజయ్య, సీనియర్ నాయకులు పరమేష్, ఐలేష్, రామచంద్రపురం పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

## నాలా సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం





### ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 21 (నినాదం):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) దుండిగల్ సర్కిల్ పరిధి బౌరంపేట్ డివిజన్ పరిధిలోని మల్లంపేట్ చిన్నం చెరువు అలుగు నాలా సమస్యను పరిష్కరించేందుకు దాదాపు 9.80 కోట్ల రూపాయలతో నూతనంగా చేపట్టనున్న నాలా నిర్మాణ పనులతో తలెత్తనున్న సమస్యలను స్థానికులు స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఎమ్మెల్యే శంభీపూర్ రాజు దృష్టికి తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు వివిధ విభాగాల అధికారులతో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ వరద నీటితో ముంపుకు గురవుతున్న కాలనీల ముంపు సమస్య – పరిష్కారంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూవరద నీటితో ముంపుకు గురవుతున్న ప్రాంతాల్లో తీవ్రతను తగ్గించే దిశగా చర్యలు చేపట్టి వరద ముంపుకు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రయోజనాలే తమ ప్రాధాన్యత అని, అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ప్రతిపాదిత నాలా నిర్మాణం వల్ల ఎక్కువగా ఆస్తినష్టం జరిగే పరిస్థితి ఉన్నందున గ్రామం శివారు నుంచి కాకుండా పూర్వపు నాలా ద్వారానే నీటి ప్రవాహ దిశకు అనుగుణంగానే కాలువ నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలన్నారు. గ్రామస్తుల ఆందోళన మాకు తెలుసని ఈ సమస్యను ఉన్నతాధికారులతో చర్చించి సమస్యను అందరి ఆమోదంతో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎండీఏ లేక్స్, ఇరిగేషన్, మున్సిపల్, హైడ్రా విభాగాలకు చెందిన పలువురు అధికారులు, మాజీ కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, మాదాసు వెంకటేశం, అర్కల అనంతస్వామి, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి,శామీర్ పేట హన్మంత్ రావు, ఎంబరి ఆంజనేయులు, విష్ణువర్ధన్ రెడ్డి, నాచారం మురళీ యాదవ్, గ్రామస్తులు, పలు కాలనీల వాసులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు స్మార్ట్ ఫోన్లు అందజేత



**వికారాబాద్, ఏప్రిల్ 21(నినాదం ):** జిల్లా పరిధిలోని నవాబుపేట మండల కేంద్రంలో ఎంపిడివో కార్యాలయంలో మంగళవారం చేవెళ్ళ ఎమ్మెల్యే కాలె యాదయ్య అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం ద్వారా స్మార్ట్ ఫోన్లు అందజేశారు. అనంతరంప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యక్రంలో భాగంగా ఏప్రిల్ 20 నుండి 26 వరకు సంక్షేమ వారంలో భాగంగ నవాబుపేట మండల కేంద్రంలోని సంక్షేమ హాస్టల్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ అంగన్వాడి టీచర్లు గ్రామీణ స్థాయిలో చిన్నారుల అభివృద్ధికి, గర్భిణీ స్త్రీల ఆరోగ్యానికి కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ఈ స్మార్ట్ ఫోన్లు వారి పనితీరును మరింత సులభతరం చేస్తాయని అన్నారు. టెక్నాలజీ సహాయంతో సేవలను వేగవంతంగా, పారదర్శకంగా ప్రజలకు చేరవేయడం సాధ్యమవుతుందన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా పిల్లల పోషణ, ఆరోగ్య పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. టీచర్లు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని, మరింత మెరుగైన సేవలను అంధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం పీ డివో అనురాధ, నాయకులు చిట్టెపు మల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రభాకర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.



## జనగణన విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యం సహించేది లేదు

- డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ భారతి హోళికేరి



**మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 21 (నినాదం):** జన గణన విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యం సహించేది లేదని డైరెక్టర్ ఆఫ్ సెన్సెస్ భారతి హోళికేరి స్పష్టం చేశారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మేడ్చల్ మండలం పరిధిలోని ఎల్లంపేట గ్రామంలో గల భారత్ బైబిల్ కాలేజీలో నిర్వహించిన జనగణన శిక్షణ కార్యక్రమానికి డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ శ్రీమతి భారతి హోలికేరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె శిక్షణ పొందుతున్న సిబ్బందిని ఉద్దేశించి ప్రసంగిస్తూ,దేశాభివృద్ధిలో జనగణన కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ప్రభుత్వ పథకాలు, వనరుల కేటాయింపు భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించడానికి ఖచ్చితమైన గణాంకాలు అవసరమని ఆమె పేర్కొన్నారు. జనగణన సేకరణలో ఎటువంటి తప్పులు దొర్లకుండా, క్షేత్రస్థాయిలో పూర్తి పారదర్శకతతో డేటాను సేకరించాలని అధికారులకు మరియు సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సెన్సస్ తయారీకి సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనుసరించాల్సిన విధివిధానాలపై ఆమె పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డి. విజయేందర్ రెడ్డి, ఎల్లంపేట మున్సిపల్ కమిషనర్ స్వామి, ఎలక్షన్ సెక్షన్ డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి, మేడ్చల్ డిప్యూటీ తహసీల్దార్ అనుష, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కుమార్ ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

### వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్



**మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 21 (నినాదం):** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక వారోత్సవాల్లో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ ముడుచింతలపల్లి మండలం, జగ్గంగూడ గ్రామంలోని తెలంగాణ మైనార్టీ వసతి గృహ పాఠశాల (టీఎంఆర్ఈఐఎస్)ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకొని తమలోని నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' లక్ష్యాలను వివరిస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. వెల్ఫేర్ విద్యార్థుల కోసం క్విజ్, డిబెట్, చిత్రలేఖనం వంటి పోటీలతో టాలెంట్ ఫేస్ట్ నిర్వహించి సృజనాత్మకతను, మేధస్సును ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారికాంతమ్మ ,ముడుచింతలపల్లి మున్సిపల్ కమిషనర్ కుమార్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింహులు యాదవ్. ఈ సందర్శనలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, భోజన సౌకర్యాల పట్ల అదనపు కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

## పోలీస్ సిబ్బందికి బాసటగా కోఆపరేటివ్ సొసైటీ

### ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్



**వికారాబాద్, ఏప్రిల్ 21(నినాదం):** జిల్లా పోలీసు కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ సర్వసభ్య సమావేశం జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఆర్థిక సంవత్సరంలో సొసైటీ సాధించిన పురోగతిని, సిబ్బందికి అందించిన రుణ సదుపాయాలను ఇతర సంక్షేమ ఫలాలను కార్యనిర్వాహక సభ్యులు ఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ అహర్నిశలు శాంతిభద్రతల పరిరక్షణలో శ్రమిస్తున్న పోలీస్ సిబ్బంది వారి కుటుంబాల సంక్షేమం కోసం జిల్లా పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ ఆర్థిక సహాయంగా నిలుస్తుందని కొనియాడారు. సిబ్బంది పిల్లల చదువుల కోసం మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందజేయడం, అత్యవసర పరిస్థితుల్లో సభ్యులకు తక్షణ రుణాలు మంజూరు చేయడం, విధి నిర్వహణలో అకాల మరణం సంభవించినప్పుడు బాధిత కుటుంబాలకు తక్షణ ఆర్థిక భరోసా కల్పించడం వంటి కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే పదవీ విరమణ పొందిన సభ్యులకు గౌరవప్రదంగా ఆర్థిక బహుమతులు అందజేస్తున్నామని తెలిపారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. కార్యనిర్వాహక సభ్యులు ఎప్పటికప్పుడు సమావేశమై సరైన ప్రణాళికలు రూపొందించాలని ఎస్పీ ఆదేశించారు. పారదర్శకమైన పాలనతో క్రింది స్థాయి నుండి ఉన్నతాధికారి వరకు ప్రతి ఒక్కరికీ సమన్యాయం జరిగేలా చూడాలని పిలుపునిచ్చారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సిబ్బందికి అండగా నిలవడమే సొసైటీ ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్ఐ నాగరాజు, జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి. అశోక్, పలువురు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సొసైటీ డైరెక్టర్లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రోబోటిక్ మోకాలి శస్త్రచికిత్సతో 100% ఫలితాలు

### మోకాలి రీప్లేస్మెంట్‌లో కొత్త దశ

### యశోద వైద్యుల ప్రకటన




**సిద్దిపేట, ఏప్రిల్ 21 (నినాదం):** రోబోటిక్ మోకాలి రీప్లేస్మెంట్ సిస్టం మంచి ఫలితాలు ఇస్తుందని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి వైద్యులు డాక్టర్ విక్రమ్, యశోద ఆసుపత్రి ప్రతినిధి రాజిరెడ్డిలు తెలిపారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో మోకాలి రీప్లేస్మెంట్ చేసుకున్న పేషంట్లతో కలిసి యశోద ఆసుపత్రి వైద్యులు మాట్లాడారు. సిద్దిపేట పట్టణానికి చెందిన డాక్టర్ కుమార్, శకుంతల అనే పేషెంట్లకు 45 రోజుల క్రితం మోకాలి రీప్లేస్మెంట్ ఆపరేషన్ రోబోటిక్ ద్వారా నిర్వహించామని, 100% రీప్లేస్మెంట్ రిజల్ట్ సాధించామని తెలిపారు. రోబోటిక్ సిస్టం ద్వారా ఆపరేషన్ చేస్తే త్వరగా రికవరీ అవుతారని, అలాగే నీ రీప్లేస్మెంట్లో కచ్చితత్వం ఉంటుందని పేర్కొన్నారు. రోబోటిక్ సిస్టం ద్వారా ఆపరేషన్ చేస్తే నొప్పి చాలా తక్కువ ఉంటుందని మొదటి రోజే నడవ గలుగుతారని అన్నారు. సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో అత్యాధునిక సౌకర్యాలతో మోకాలి రిప్లేస్మెంట్ నిర్వహిస్తున్నామన్నారు. సిద్దిపేట పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఘనంగా శ్రీ వారాహి టీ ప్యాలెస్ ప్రారంభం



**అల్వాల్, ఏప్రిల్ 21 (నినాదం):** అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం డివిజన్ జొన్న బండ ప్రాంతంలో శ్రీ వారాహి టీ ప్యాలెస్ ను మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి నిర్వాహకుడైన రాచకొండ వెంకటేష్ తో కలిసి ప్రారంభించారు. ఏ వ్యాపారమైన నాణ్యత. శుభ్రత రుచికరమైన పదార్థాలను ప్రజలకు అందించి మన్నలను పొందినప్పుడే ఆ వ్యాపారం సజావుగా సాగుతుందని ఆయన అన్నారు. నాణ్యత విలువలతో కూడిన వ్యాపారం రాణిస్తుందని ప్రజలే దేవుళ్ళని నమ్మకంతో వ్యాపారం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, కుటుంబ సభ్యులు స్థానిక నాయకులు డోలి రమేష్, వినయ్, మహేష్, పవన్ ,తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ తల్లి దీవెనలు ప్రజలందరిపై ఉండాలి

### బిఆర్ఎస్ జిల్లా నాయకుడు మేకల అయ్యప్ప



**జవహర్ నగర్, ఏప్రిల్ 21 (నినాదం):** గ్రామదేవతలు ప్రజల్లో సామరస్యతను ఐక్యతను పెంపొందిస్తారని ఎల్లమ్మ తల్లి దీవెనలు ప్రజలందరిపై ఉండాలని బిఆర్ఎస్ జిల్లా నాయకుడు మేకల అయ్యప్ప అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లోని గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఎల్లమ్మ తల్లి కళ్యాణోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మేకల అయ్యప్ప హాజరై మాట్లాడుతూ భక్తి భావంతోనే ప్రజల్లో సుఖసంతోషాలు కలుగుతాయని ప్రతి ఒక్కరు అమ్మవారిని పూజించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ గౌడ్, కృష్ణ గౌడ్, గౌడ సంఘం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ కార్మికులకు పెండింగ్ డబ్బులు వెంటనే చెల్లించాలి

### తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్



**కొమురవెల్లి, ఏప్రిల్ 21 (నినాదం):** సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలో ఉపాధిహామీ కార్మికులకు 200 రోజులు పని దినాలు కల్పించాలి రోజు కూలీ కొలతలతో సంబంధం లేకుండా 600 రూపాయలు ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలనీ ఉపాధిహామీ కార్మికులకు మూడు నెలల నుండి ఉపాధి హామీ డబ్బులు పడటం లేదు బిజెపి గవర్నమెంట్ కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ కార్మికుల పొట్టకొట్టే విధంగా కొత్త విధానాలను అమలు చేస్తూ ఉపాధి హామీ కార్మికులకు ఇబ్బంది పెట్టే విధంగా ఉంది రెండు పూటలా ఫోటో క్యాప్చులను రద్దుచేసి పాత పద్ధతిలోనే ఉపాధి హామీ పనిని కొనసాగించాలి గతంలో ఉపాధి పని చేసేటప్పుడు ప్లే స్లిప్పులు ఇచ్చేవారు ఇప్పుడు ఇవ్వడం లేదు గతంలో ఉపాధి పని చేసే దగ్గర సపరేట్ వాటర్ మేనులను పెట్టేవారు ఇప్పుడు పెట్టడం లేదు ఉపాధి హామీ కార్మికులు పని దూరం ఉన్నప్పుడు గ్రామపంచాయతీ వెహికల్ ద్వారా పని ప్రదేశానికి తీసుకెళ్లాలని గడ్డపార పట్టి తవ్వేవారికి అదనంగా డబ్బులు ఇచ్చేవారు ఇపుడు ఇవ్వడం లేదు గడ్డపార సనా పెట్టడానికి కూడా డబ్బులు ఇవ్వడం లేదు కనుక పైన ఉన్నవి అని యాదవిద్దిగా కొనసాగించాలని లేదంటే జిల్లాలో ఉన్న ఉపాధి కార్మికులను అందరిని ఏకంచేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలోతెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కనుగుల రాజు నాయకులు తేలు ఇస్తారి పాకనాటి బాలు తాడూరి లింగయ్య గుజ్జు రాజల్లయ్య తాడూరి బాలయ్య ఆకనాటి లింగం తాలూరి లతా గుజు స్వరూప తాడూరీ సిదవ్వ పాకనాటి స్వరూప తాడూరి కిష్టవ్వ తాడూరి సుగుణ తాడూరి బల్లవ్వ తాడూరి వజ్రమ్మ తాడూరి కనకవ్వ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

**మహిళా సాధికారతే ప్రజా ప్రభుత్వ లక్ష్యం**
**నిధుల దుర్వినియోగంపై కఠిన చర్యలు**
**రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క**





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో / ములుగు ప్రతినిధి (నినాదం):** ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దశలవారీగా అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క వెల్లడించారు. మంగళవారం మంగపేట మండలం మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామిని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి దర్శించుకున్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలిలో భాగంగా మంగపేట మండలం మల్లూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో చుంచుపల్లి, కొత్త మల్లూరు, మల్లూరు, నరసింహసాగర్, శనగకుంట ఆవాసం, పూరేడుపల్లి గ్రామాల ప్రజల నుంచి మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. కలిసి దరఖాస్తులు స్వీకరించారు. గ్రామ సభలను సక్రమంగా నిర్వహించి, గ్రామ ప్రజలకు అవసరమైన, అందరికీ ఉపయోగపడే అభివృద్ధి పనులకు మాత్రమే నిధులను వినియోగించాలని, గ్రామ సభ అనుమతి లేకుండా నిధులను దుర్వినియోగం చేస్తే చర్యలు తప్పవని మంత్రి సీతక్క అధికారులను హెచ్చరించారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా వినూత్నంగా స్థానిక గ్రామాల సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే సంకల్పంతో ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వంతో పాటు అధికారులు గ్రామ ప్రజల ముందుకు వస్తున్నారని తెలిపారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన దరఖాస్తులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని, పెన్షన్లు, ఇందిరమ్మ గృహాలు, ఇతర సంక్షేమ పథకాలకు వచ్చిన దరఖాస్తులపై ఫీల్డ్ విజిట్ చేసి అర్హుల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మంగపేట మండలం కమలాపూర్ గ్రామంలో బస్టాండ్ కావాలని గ్రామస్తులు తెలుపగా వెంటనే స్పందించిన మంత్రి సీతక్క బస్టాండ్ నిర్మాణానికి అనువైన స్థలం ఉంటే వెంటనే వాటి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న బస్టాండ్ గోదావరి పుష్కరాల వరకు ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చూడాలని పేర్కొన్నారు. సుమారు 70 కోట్ల రూపాయల నిధుల అంచనా తో మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని శాశ్వత ప్రతిపాదికన అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో ఉండే పుణ్యక్షేత్రాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభివృద్ధి చేయాలని సంకల్పించుకున్నారని పేర్కొన్నారు. త్వరలోనే మంగపేట కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ బస్టాండ్ మార్కెట్ యార్డ్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్ సి.హెచ్. మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేఖ కళ్యాణి, ఆర్డీఓ వెంకటేష్, జిల్లా అధికారులు, డైరెక్టర్లు, స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

# జనగణన సమర్థవంతంగా నిర్వహించాలి

**జనగణనలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఉండకూడదు**
**నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 21 (నినాదం) :** ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు జనగణను సమర్థవంతంగా నిర్వహించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. అచ్చంపేట మండల కేంద్రంలోని ఎం, ఎస్, ఎన్ హైస్కూల్లో జరుగుతున్న జనగణన శిక్షణ తరగతులను వివరాలను మంగళవారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....., గతంలో కాగితంపై జనగణన వివరాల రాసేవారని, ప్రస్తుతం 2027 జనగణన కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్లో డిజిటల్ సర్వే జరుగుతుందని, ఇండ్లు, జనగణన జాగ్రత్తగా చేయాలన్నారు. డిజిటల్ సర్వే చేసేటప్పుడు ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు యాప్లో పొరపాటున తప్పులు నమోదు చేసిన సరిచేసుకోవాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. ఎన్యుమరేటర్లు క్షేత్రస్థాయికి వెళ్లే ముందు తమకు అందజేసిన హౌస్ లిస్టింగ్ బ్లాక్ మ్యాప్ ఆధారంగా హద్దులను ముందస్తుగా తనిఖీ చేసుకోవాలని సూచించారు. ప్రతి ప్రశ్నకు సమాధానం నమోదు చేసి సర్వేను పకడ్బందీగా చేయాలని తెలిపారు. శిక్షణ సందర్భంగా ఏవైనా అనుమానా ఉంటే క్లియర్ చేసుకోవాలని చెప్పారు. ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని, జిల్లా అభివృద్ధికి తోడ్పడే జనగణన పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపినారు. జిల్లా కలెక్టర్ వెంట అచ్చంపేట ఆర్డిఓ యాదగిరి, తాహసిల్దార్ సైదులు, మాస్టర్ ట్రైనర్లు, ఇతర అధికారులు తదితరులు ఉన్నారు

# యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోళ్లలో కాంటాలు వేసే విధంగా చూడాలి

**సరిపడా లారీలను ఏర్పాటు చేయాలి .. మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాలి**
**రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రాఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ం**



**నల్లగొండ ప్రతినిధి ఏప్రిల్ 22 (నినాదం):** యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు వేగం పెంచాలని రోడ్లు,భవనాల, సినిమాటో గ్రాఫిక్ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు మంగళ వారం నల్గొండ జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో రబీ ధాన్యం సేకరణ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం రోడ్లపై పోయకుండా అవసరమైతే పాఠశాలలు ఫంక్షన్ హాల్ వద్ద కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రాలకు అవసరమైన లారీలను పెంచాలని రాత్రి పగలు తేడా లేకుండా లైట్లు ఏర్పాటు చేసి ధాన్యం కాంటాలు చేయాలని ఎప్పటికప్పుడు లారీల ద్వారా మిల్లులకు పంపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు రైతులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు తాగడానికి నీరు, ఉండడానికి కచ్చితంగా నీడ ఏర్పాటు చేయాలన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో సుమారు రెండు లక్షల 30 వేల మెట్రిక్ అన్న ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. ఎక్కడ ఏలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి కలెక్టర్ బి. చంద్రశేఖర్ అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్ డిఆర్ఓ వై అశోక్ రెడ్డి పౌరసరఫరాల, వ్యవసాయ శాఖ మార్కెటింగ్, డి ఆర్ డి ఐ డి సి ఓ రవాణా అధికారులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి , మాజీ జెడ్పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన సిద్దిపేట విద్యార్థులు

**సిద్దిపేట ఏప్రిల్ 21(నినాదం):** జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సిద్దిపేట విద్యార్థులు ఊడెం కౌశిక్ వర్ధన్ రెడ్డి, లుక్కా అక్షయ్ గుణ తమ సత్తా చాటి ఉత్తమ ర్యాంకులు సాధించారు. నిన్న రాత్రి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ( ఎన్టిఏ) జేఈఈ మెయిన్స్ ఫలితాలను ప్రకటిం చింది. జాతీయస్థాయిలో 16 లక్షలకు పైగా విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరైనారు. ఈ ఫలితాల్లో సిద్దిపేట పట్టణానికి చెందిన ఊడెం రఘువర్ధన్ రెడ్డి - సుహాసినిల కుమారుడు ఊడెం కౌశిక్ వర్ధన్ రెడ్డి 1594వ ర్యాంకు, లుక్క రాజు - ఉమల కుమారుడు అక్షయ్ గుణ 873 ర్యాంకుతో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 16 లక్షల విద్యార్థులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రెండు లక్షల మంది విద్యార్థులను జేఈఈ అడ్వాన్స్ పరీక్షలకు అర్హత కల్పిస్తారు. ఇందులో ఉత్తమ ఫలితాలు సాధించి ఐ ఐ టి బాంబేలో ప్రవేశం పొందడమే లక్ష్యంగా చదువుతున్నట్లు విద్యార్థులు తెలిపారు. ఉత్తమ ర్యాంకులు పొందడం పట్ల తల్లిదండ్రులు





# మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశం




**సిద్దిపేట ఏప్రిల్ 21(నినాదం):** మంగళవారం జిల్లా కలెక్టర్ కే.హైమావతి ఐడిఓసి మినీ సమావేశ మందిరంలో జిల్లాలో నూతనంగా ఎంపికైన జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి 2026-28 కాలానికి మీడియా అక్రిడేషన్ కార్డుల జారీపై చర్చించారు. ముందుగా జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులుగా ఎంపికైన వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో జర్నలిస్టులకు మీడియా అక్రిడేషన్ జారీ కోసం ఆన్లైన్ లో చేసుకున్న అప్లికేషన్లను, ఆయా మీడియా సంస్థలు అందజేసిన జాబితాను, జీవో కాపీ ని పరిశీలించి అర్హులైన జర్నలిస్టులకు నూతన అక్రిడేషన్ కార్డులను అందజేసేందుకు కమిటీ సభ్యులు సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులతో కలిసి పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో డిపిఆర్ఓ రవికుమార్, సమాచార శాఖ డిఈ భూపాల్, కమిటీ సభ్యులు కలకుంట్ల రంగాచారి, కే మహిపాల్ రెడ్డి, వంగ రాజు, పైడిపల్లి అరుణ్ కుమార్, బి. వంశీధర్, కూతురు రాజిరెడ్డి, ఐతే శ్రీనివాస్, ఎం.గిరిబాబు, సమాచార శాఖ సీనియర్ అసిస్టెంట్ రాంబాబు, సిబ్బంది రాములు, మహేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.


N NADAM CINEMA

## జూన్ 11న డ్రాగన్ మూవీ విడుదల




ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతోన్న పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రానున్న డ్రాగన్ చిత్రం కొత్త విడుదల తేదీని నిర్మాణ సంస్థ తాజాగా ప్రకటించింది. ఈ సినిమాను వచ్చే ఏడాది జూన్ 11న విడుదల చేయనున్నట్లు తెలిపింది. తుపాను తన లక్ష్యాన్ని కనుగొంది. 2027 జూన్ 11న థియేటర్‌లలో తుపాను రావడం ఖాయం అంటూ కొత్త విడుదల తేదీతో పాటు ఓ అప్‌డేట్‌ను పంచుకుంది. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు తెలిపింది. మొదట ఈ సినిమాను ఈ ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ భావించారు. భారీస్థాయిలో ఈ ప్రాజెక్ట్ తెరకెక్కుతుండడంతో దీన్ని ఈయేడాది జూన్ 25కు వాయిదా వేశారు. అయితే ఇంకా షూటింగ్ పూర్తికాకపోవడం.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు మిగిలిఉండడంతో ఇప్పుడు వచ్చే ఏడాదికి వాయిదా వేశారు. ప్రశాంత్ నీల్ మేకింగ్ విషయంలో ఎక్కడా రాజీపడకుండా దీన్ని రూపొందిస్తున్నారు. సినిమా ఆలస్యమైనా.. అభిమానులు కోరుకునేలా ఉండేలా చూస్తున్నారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. 'డ్రాగన్' అనే పేరు ప్రచారంలో ఉంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తోన్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ తన లుక్ మార్చుకున్నారు. బరువు తగ్గి నాజూగ్గా కనిపిస్తున్నారు. ఇటీవల తన జిమ్ ఫొటో విడుదల చేయగా అది వైరల్ అయింది. దీంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

## శివాజీ చరిత్ర ఆధారంగా రాజా శివాజీ




మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరగాథను వెండితెరపై ఆవిష్కరిస్తూ రితేష్ దేశ్‌ముఖ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'రాజా శివాజీ' చిత్రం ప్రస్తుతం దేశవ్యాప్తంగా సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ చారిత్రక చిత్రానికి రితేష్ దేశ్‌ముఖ్ స్వయంగా దర్శకత్వం వహిస్తుండగా, ఆయన భార్య జెనీలియా దేశ్‌ముఖ్ తన సొంత నిర్మాణ సంస్థ ముంబై ఫిల్మ్ కంపెనీ మరియు జియో స్టూడియోస్ భాగస్వామ్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే భారీ విజువల్స్ మరియు పవర్‌ఫుల్ డైలాగ్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచేశాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ ఒక కీలకమైన ప్రతినాయక పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. శివాజీ మహారాజ్ స్వరాజ్యం కోసం చేసిన పోరాటాన్ని, ఆయన సాహసాలను ఎంతో గ్రాండ్‌గా చూపించబోతున్న ఈ సినిమాను మరాఠీ మరియు హిందీ భాషల్లో ప్రధానంగా రూపొందించారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. గతంలో 'వేద్' వంటి భారీ విజయాలను అందుకున్న రితేష్-జెనీలియా కాంబో ఈ చారిత్రక చిత్రంతో మరోసారి బాక్సాఫీస్ వద్ద తమ సత్తా చాటడానికి సిద్ధమవుతున్నారు

## జైలర్-2 షూటింగ్ పూర్తి

**కేక్ కట్‌చేసి సెటబ్రేషన్ చేసుకున్న యూనిట్**



సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2' సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ గురించి తాజాగా కీలక అప్‌డేట్ వెలువడింది. చిత్ర బృందం అధికారికంగా షూటింగ్ పూర్తయిందని ప్రకటించ దంతో, అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. షూటింగ్ పూర్తయిన సందర్భంగా చిత్ర యూనిట్ రజనీతో కలిసి కేక్ కట్ చేసి సెలబ్రేషన్స్ జరుపుకుంది. ఈ సందర్భంగా బయటకు వచ్చిన ఫోటోలు, వీడియోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలోకి ప్రవేశించింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా పూర్తి చేస్తే, సినిమా అనుకున్న సమయానికి ముందే విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు చిత్ర బృందం అధికారిక విడుదల తేదీని ప్రకటించలేదు.

## ప్యారడైజ్ కోసం రెండేళ్ల సమయం కేటాయింపు

**నటి కాయదు లోహర్ సంచలన నిర్ణయం**



తెలుగు సినీ పరిశ్రమలో ఒకే సినిమాకు ఏళ్ల తరబడి సమయం కేటాయించడం అరుదైన విషయం. గతంలో బాహుబలి వంటి భారీ ప్రాజెక్ట్ కోసం అనుష్క శెట్టి తన కెరీర్‌లో ఐదు సంవత్సరాలను కేటాయించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే తరహాలో యువ నటి కాయదు లోహర్ కూడా సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న 'ప్యారడైజ్' సినిమా కోసం కాయదు లోహర్ దాదాపు రెండేళ్లుగా మరే ఇతర ప్రాజెక్ట్‌కి కమిట్ కాకుండా పూర్తిగా ఈ ఒక్క సినిమాపైనే దృష్టి పెట్టింది. ఎదుగుతున్న హీరోయిన్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం పెద్ద రిస్క్‌గా సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల కాయదు లోహర్ నటించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. అలాంటి సమయంలో కొత్త అవకాశాలను పక్కన పెట్టి ఒక్క ప్రాజెక్ట్‌పైనే ఆధారపడటం ఆమె కెరీర్‌కు సవాల్‌గా మారవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఒకవేళ 'ప్యారడైజ్' ఆశించిన స్థాయిలో హిట్ కాకపోతే, దాని ప్రభావం ఆమె భవిష్యత్తుపై పడే అవకాశముంది. అయితే ఈ సినిమాలో కాయదు పాత్ర కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, నటనకు మంచి స్కోప్ ఉన్నట్టుగా తెలుస్తోంది. భావోద్వేగపూరిత సన్నివేశాల్లో తన ప్రతిభను చూపించే మంచి ఛాన్స్ ఆమెకు దక్కిందని సమాచారం. ఇదే కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్‌కి అంత సమయం కేటాయించినట్లు తెలుస్తోంది. నాని వంటి ప్రతిభావంతుడితో స్క్రీన్ షేర్ చేసుకోవడం కూడా కాయదు కెరీర్‌కు ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా సక్సెస్ అయితే, కాయదు లోహర్‌కు పెద్ద బ్రేక్ వచ్చే అవకాశం ఉంది. మరోవైపు పరిశ్రమలో వరుస సినిమాలు చేయడం కూడా నటీమణుల కెరీర్‌కు ముఖ్యమే. ఒకే ప్రాజెక్ట్‌పై ఎక్కువ కాలం ఆధారపడితే ఇతర అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

## 'సూర్య బి పాజిటివ్' చిత్ర టీజర్ విడుదల




కాళీ క్రాఫ్ట్స్ నిర్మలం డ్రామాస్ బ్యానర్లపై సుబ్బా మాధవరపు దర్శకత్వంలో రూపొందిన 'సూర్య బి పాజిటివ్' చిత్ర టీజర్ విడుదల వేడుక హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు కౌశిక్ పెగల్లపాటి (కిష్కింధపురి ఫేమ్), మురళీకాంత్ దేవసోత్ (దండోరా ఫేమ్) ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర టీజర్‌ను ఆవిష్కరించారు. చరణ్ పీసర్ల హీరోగా నటిస్తూ డైలాగ్స్ రాయడంలోనూ పాలుపంచుకున్న ఈ చిత్రంలో యానీ దయానా, దివ్య విశ్వకర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. టీజర్ ఆవిష్కరణ అనంతరం ముఖ్య అతిథిగా వచ్చిన మురళీకాంత్ దేవసోత్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ఒక సినిమాను నిర్మించడం ఎంత కష్టమో తనకు తెలుసని, అమెరికాలో ఉద్యోగం చేస్తూనే సుబ్బా మాధవరపు ఇక్కడికి వచ్చి పట్టుదలతో ఈ సినిమాను పూర్తి చేయడం అభినందనీయమని కొనియాడారు. టీజర్‌లోని విజువల్స్, నటీనటుల ప్రతిభ సినిమాపై ఆసక్తిని కలిగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మరో అతిథి కౌశిక్ పెగల్లపాటి మాట్లాడుతూ, చరణ్ తనకు కాలేజీ జూనియర్ అని, హీరోగా గుర్తింపు తెచ్చుకోవాలనే తపన అతనిలో బలంగా ఉందని అన్నారు. ఒక సామాన్యుడి కథను వెండితెరపై ఆవిష్కరిస్తున్న తీరు ప్రేక్షకులను మెప్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరో చరణ్ పీసర్ల తన ప్రసంగంలో ఉద్వేగానికి లోనయ్యారు. ఈ నాలుగవ ప్రయత్నం ద్వారా నటుడిగా ప్రేక్షకుల నుంచి అర్హతను ఆశిస్తున్నానని తెలిపారు.

ÔáPrinted, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 8333068787